

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | ఆదివారం | 31.05.2026 | సంపుటి: 3 | సంచిక: 119 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | SUNDAY | 31.05.2026 | V0LUME : 3 | ISSUE : 119 | PAGES: 8 | COST: 2/- |



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575





## ఫ్రంటల్ పైరవీల దందా

# కాంగ్రెస్‌కు కొత్త తలనొప్పి

- మంత్రుల పేర్లతో వసూళ్ల ఆరోపణలు
- ఉద్యోగాలు, ఇందిరమ్మ ఇళ్ల పేరిట మోసాలు
- ఫోటోలు పెట్టుబడిగా అమాయకులే లక్ష్యం
- గాంధీభవన్‌కు చేరిన బాధితుల ఫిర్యాదులు
- యూత్ కాంగ్రెస్ నేతపై పోలీసు కేసు నమోదు
- ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలుగుతోందన్న ఆందోళన
- పార్టీ పునాదులనే దెబ్బతీస్తున్న పైరవీకారులు
- అధిష్టానం, పోలీసుల చర్యలపై ఆసక్తి

**తెలంగాణ బ్యూరో, రాజముద్ర న్యూస్:**

పదేళ్ల విరామం తర్వాత తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఇప్పుడు ఫ్రంటల్ ఆర్గనైజేషన్లలోని కొందరు నేతల వ్యవహారం తలనొప్పిగా మారినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తాము మంత్రులకు అత్యంత సన్నిహితులమంటూ ప్రచారం చేసుకుంటూ, ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు

మిగతా 2వ పేజీలో..

## మోటర్లకు మీటర్లు పెడితే

# ఎన్నికల్లో పోటీచేయను

- ఉచిత విద్యుత్ ఆపేసినా రాజకీయాల నుంచి తప్పుకుంటా
- లేకుంటే బిఆర్ఎస్ రాజకీయాల నుంచి తప్పుకుంటుందా
- రైతుల ముసుగులో లబ్ధికి కెసిఆర్ రాజకీయ ఎత్తుగడలు
- ధాన్యం కొరుగోళ్లలో కేంద్రం తీరు దుర్మార్గం
- కొనకపోతే బీజేపీ ఎంపీల ఇళ్లముందు ధాన్యం పోస్తాం
- మహేష్ గౌడ్‌ది, నాది విన్నింగ్ కాంబినేషన్
- మీడియా చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, మే 30( రాజముద్ర న్యూస్):**

వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ నిలిపివేసినా, మోటార్లకు మీటర్లు పెట్టినా తాము ఎన్నికల్లో పోటీ చేయబోమని, ఈ సవాల్‌కు బీఆర్ఎస్ సిద్ధమా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం ఆయన మీడియాతో చిట్ చాట్ చేస్తూ రాజకీయ లబ్ధి కోసమే కేసీఆర్ రైతుల ముసుగులో లైఫ్ లైన్ కోసం ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. దేశంలోనే తొలిసారిగా రైతుల కోసం ప్రత్యేకంగా 'రైతు డిస్కం'

మిగతా 2వ పేజీలో..

## సీబీఎస్ఈ మార్కుల గందరగోళంపై సమాధానం చెప్పాలి

**హైదరాబాద్, మే 30( రాజముద్ర న్యూస్):**

సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాల వివాదంపై పోరాడుతున్న విద్యార్థులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ K. T. Rama Rao మద్దతు తెలిపారు. మార్కుల కేటాయింపులో జరిగిన అవకతవకలపై విద్యార్థులు, తల్లిదండ్రులు పారదర్శకత కోరే హక్కు కలిగి

మిగతా 2వ పేజీలో..



## ఆటా తెలుగు మహాసభలకు కేటీఆర్‌కు ఆహ్వానం

2

## కాంగ్రెస్ కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం

2



## చెరువు అభివృద్ధి పేరుతో భారీ కుట్ర..

బట్టబయలు చేసిన హైడ్రా
ముష్కిన్ చెరువులో అక్రమ నిర్మాణాల కూల్చివేత
రూ. 5,500 కోట్ల విలువైన ప్రభుత్వ భూమికి రక్షణ
చెరువు మధ్యలో నిర్మించిన ఎంబ్యాంక్‌మెంట్ తొలగింపు
పేదల పేరుతో భూకబ్జా యత్నానికి చెక్
జలవనరుల పరిరక్షణలో హైడ్రా మరో కీలక ఆపరేషన్

3

## కొనుగోలు కేంద్రాల్లో

# రైతుల గోస

- అన్నదాత కన్నీరు కనిపించడం లేదా?
- కటింగ్‌లతో మిల్లర్ల దోపిడీ
- ప్రభుత్వ తీరుపై హరీశ్‌రావు ఆగ్రహం



3

## విజయవాడ హైవేపై ట్రావెల్స్ బస్సు దగ్ధం

- అప్రమత్తమైన డ్రైవర్‌తో తప్పిన పెను ప్రమాదం
- ప్రాణాలతో బయటపడ్డ 36 మంది ప్రయాణికులు
- ఇంజిన్‌లో మంటలతో బస్సు పూర్తిగా కాలిపోవడం
- పెద్దకాపర్తి సమీపంలో ఘటన
- కారణాలపై దర్యాప్తు

**నల్గొండ, మే 30( రాజముద్ర న్యూస్):**

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అగ్నికి

మిగతా 2వ పేజీలో..





## తెలంగాణ ఉద్యమకారులకు తగిన గుర్తింపు

- 4న అఖిలపక్ష భేటీ జరపాలని నిర్ణయం
- కేశవరావు కమిటీ తొలి భేటీ

**హైదరాబాద్, మే 30( రాజముద్ర న్యూస్):**

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం ప్రభుత్వం నియమించిన కమిటీ చైర్మన్ డాక్టర్ కె.కేశవరావు అధ్యక్షతన శనివారం సచివాలయంలో

మిగతా 3వ పేజీలో..




## గిరిజన గురుకులాలు దేశానికే ఆదర్శం

విద్యార్థులపై పెట్టుబడి భవిష్యత్తు తెలంగాణపై పెట్టుబడే
దళిత, గిరిజన, బలహీనవర్గాల విద్యకు రేవంత్ సర్కార్ పెద్దపీట
గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి

**హైదరాబాద్, మే 30( రాజముద్ర న్యూస్):**

విద్యను ఖర్చుగా కాక భవిష్యత్తు తరాలపై చేసే పెట్టుబడిగా భావిస్తున్న రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బలహీనవర్గాల విద్యాభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యత

మిగతా 3వ పేజీలో..




## చదువే ప్రపంచాన్ని మార్చే ఆయుధం

- మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

**హైదరాబాద్, మే 30( రాజముద్ర న్యూస్):**

ప్రపంచాన్ని, జీవితాన్ని మార్చే శక్తి చదువుతోనే సాధ్యమవుతుందని, ఒకవేళ జీవితంలో అన్నీ కోల్పోయినా చదువు ఉంటే మళ్లీ నిలబడగలుగుతామని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. కొంగరకలాన్‌లోని రంగారెడ్డి

మిగతా 2వ పేజీలో..




## పేదవాని గుమ్మం వద్దకు ప్రభుత్వ పథకాలు

- పట్టణ పేదలకు లక్ష ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక
- పేదవాని గుమ్మం వద్దకు ప్రభుత్వ పథకాలు
- రెవెన్యూ, హౌసింగ్ మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, మే 30( రాజముద్ర న్యూస్):**

పట్టణ పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా వారు నివసించే ప్రాంతాల పరిధిలోనే అధునాతనమైన ఇందిరమ్మ ఇళ్లను కట్టి ఇస్తామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార

మిగతా 3వ పేజీలో..




## తగ్గని ఎండల తీవ్రత

- ఎల్‌నినోతో ఆలస్యం కానున్న రుతు పవనాలు

3

# ఫ్రంటల్ పైరవీల దందా
# కాంగ్రెస్‌కు కొత్త తలనొప్పి

**మొదటిపేజీ తరువాయి**

ఇప్పిస్తామని చెప్పి అమాయకుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
సచివాలయంలో మంత్రులతో దిగిన ఫోటోలను సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తూ ప్రభావశీలులమనే భావన కల్పిస్తున్నారని సమాచారం. ఆ తర్వాత ఉద్యోగాలు, వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధులు ఇప్పిస్తామంటూ ఒక్కో వ్యక్తి వద్ద లక్షల రూపాయలు తీసుకుంటున్నట్లు చెబుతున్నారు. డబ్బులు అందుకున్న తర్వాత బాధితులకు అందుబాటులో లేకుండా పోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.
ఈ వ్యవహారం హైదరాబాద్‌కే పరిమితం కాకుండా జిల్లాలకు కూడా విస్తరించినట్లు రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇటీవల యూత్ కాంగ్రెస్‌కు చెందిన ఓ నాయకుడు ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలతో సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన విషయం చర్చనీయాంశంగా మారింది. ఇదే తరహాలో మరికొంత మంది వద్ద కూడా డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పేరుతో కూడా కొందరు డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఫిర్యాదులు వెలుగులోకి వస్తున్నాయి. బాధితుల్లో కొందరు సాక్ష్యాధారాలతో రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం గాంధీభవన్‌ను ఆశ్రయించినట్లు సమాచారం. దీంతో ఈ వ్యవహారం పార్టీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలనే డిమాండ్ పెరుగుతోంది. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో, కొందరి చర్యలు పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నాయనే ఆవేదన కాంగ్రెస్ నాయకుల్లో వ్యక్తమవుతోంది. మంత్రుల పేర్లు ఉపయోగిస్తూ జరుగుతున్న ఈ తరహా మోసాలకు అడ్డుకట్ట వేయకపోతే ప్రభుత్వం, పార్టీపై ప్రజల్లో నమ్మకం దెబ్బతినే ప్రమాదం ఉందని రాజకీయ పరిశీలకులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధిష్టానం, పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.

## సీబీఎస్ఈ మార్కుల గందరగోళంపై సమాధానం చెప్పాలి: కేటీఆర్

**మొదటిపేజీ తరువాయి**

ఉన్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, ప్రస్తుతం సీబీఎస్ఈ మార్కుల వివాదంలో కేంద్రంగా నిలిచిన గ్లోబరెనా సంస్థే 2019లో తెలంగాణ ఇంటర్మీడియట్ ఫలితాల గందరగోళానికి కారణమైన సంస్థ అని గుర్తుచేశారు. అప్పట్లో బీఆర్ఎస్ ప్రభుత్వం మూడు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు సంస్థపై న్యాయపరమైన చర్యలు చేపట్టిందన్నారు.
గత చరిత్ర ఉన్నప్పటికీ అదే సంస్థకు సీబీఎస్ఈ కీలక బాధ్యతలు అప్పగించడం ఆశ్చర్యకరమని, నిబంధనలను సైతం సవరించి సంస్థకు అనుకూలంగా వ్యవహరించినట్లు కనిపిస్తోందని ఆరోపించారు. దీంతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందన్నారు.
ఈ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం, కేంద్ర విద్యాశాఖ సమాధానం చెప్పాలని డిమాండ్ చేసిన కేటీఆర్, విద్యార్థుల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించి, తప్పిదాలను సరిదిద్ది, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులకు న్యాయం, పారదర్శకత, జవాబుదారీతనం కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు.



## ఆటా తెలుగు మహాసభలకు కేటీఆర్‌కు ఆహ్వానం

**హైదరాబాద్, మే 30**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే టి రామారావు ను అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. 2026 జూలై 31, ఆగస్టు 1, 2 తేదీల్లో అమెరికాలోని మేరీల్యాండ్ రాష్ట్రంలో నిర్వహించనున్న 19వ అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ATA) తెలుగు మహాసభలకు హాజరుకావాలని ఆహ్వానించింది. ఈ సందర్భంగా ఆటా అధ్యక్షుడు జయంత్ చల్ల ఆటా కాన్ఫరెన్స్ నేషనల్ కోఆర్డినేటర్ శరత్ వేముల మహాసభల సందర్భంగా నిర్వహించనున్న వివిధ కార్యక్రమాలను కేటీఆర్‌కు వివరించారు. అలాగే అమెరికాలో నివసిస్తున్న భారతీయుల పరిస్థితులు, అక్కడి రాజకీయ పరిణామాలపై కూడా చర్చించారు.
ఈ సమావేశంలో ఆటా కాన్ఫరెన్స్ కోఆర్డినేటర్ తిరుమల రెడ్డి ,ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆటా తెలుగు మహాసభలకు హాజరయ్యేందుకు కేటీఆర్ సానుకూలంగా స్పందించినట్లు ప్రతినిధులు తెలిపారు.



## విజయవాడ హైవేపై ట్రావెల్స్ బస్సు దగ్ధం

**మొదటిపేజీ తరువాయి**

ఆహుతైంది. నల్గొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి సమీపంలో జరిగిన ఈ ఘటనలో 36 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడటంతో పెను ప్రమాదం తప్పింది. హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్తున్న రెయిన్‌బో ట్రావెల్స్ బస్సులో ప్రయాణ మధ్యలో ఇంజిన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పరిస్థితిని గమనించిన డ్రైవర్ వెంటనే బస్సును రోడ్డుపక్కన నిలిపి ప్రయాణికులను అప్రమత్తం చేశారు. ప్రయాణికులంతా దిగిన కొద్దిసేపటికే మంటలు బస్సు మొత్తం వ్యాపించడంతో వాహనం పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. బస్సులో మంటలు చెలరేగడానికి గల కారణాలపై అధికారులు విచారణ చేపట్టారు.

# మోటర్లకు మీటర్లు పెడితే ఎన్నికల్లో పోటీచేయను

**మొదటిపేజీ తరువాయి**

ఏర్పాటు చేశామని, దీనివల్ల ప్రభుత్వానికి తక్కువ ధరకే విద్యుత్ కొనుగోలు చేసే వెసులుబాటుతో పాటు జవాబుదారీతనం పెరుగుతుందని స్పష్టం చేశారు. భారత రాష్ట్ర సమితికి సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. మోటార్లకు టర్లు పెడితే, రైతులకు ఉచిత విద్యుత్ నిలిపివేస్తే.. తాము ఎన్నికల్లో పోటీ చేయబోమన్నారు. తాము ఉచిత విద్యుత్ కొనసాగిస్తే.. బీఆర్ఎస్ ఎన్నికలకు దూరంగా ఉంటుందా అని సిఎం రేవంత్ సవాల్ విసిరారు. రైతుల ముసుగులో కేసీఆర్ రాజకీయ లబ్ధికి యత్నిస్తున్నారని ఆరోపించారు. అన్నదాతలకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించేందుకే రైతు డిస్కం ఏర్పాటు చేస్తున్నాం. ఉచితంగా అందిస్తున్న విద్యుత్ వినియోగాన్ని దీనికి కనెక్ట్ చేస్తున్నాం. రైతు డిస్కంతో జవాబుదారీతనం పెరుగుతుందన్నారు. వ్యవసాయ మోటర్లకు టర్లు పెట్టాలని ప్రధాని మోడీ ఎప్పుడూ చెప్పలేదన్నారు. ఇది చెప్పకున్నా బిఆర్ఎస్ తన రాజకీయ లబ్ధి కోసం పదేపదే దీనిని వాడుకుందని ఆరోపించారు. ఎపిలో కూడా జగన్ స్మార్ట్ టర్లు పెడతానని ఎప్పుడూ చెప్పలేదన్నారు. మేం ఏడాదికి రూ.70 వేల కోట్లు అప్పు చేస్తే రూ.95 వేల కోట్ల అప్పు తీరుస్తున్నాం. మేం తీరుస్తున్న అప్పుల గురించి హరీశ్‌రావు చెప్పడం లేదు. రూ.54 వేల కోట్లు అప్పులు తీసుకుంటామని ముందే చెప్పాం. ఎఫ్ఆర్‌బీఎం పరిధి దాటి అప్పులు చేయడానికి అనుమతి లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి వదిలేసిందే తప్ప ఒక్క గింజ కూడా కొనడం లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో వరి, జొన్న, మొక్కజొన్న పంటలను తమ ప్రభుత్వమే పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తోందని, ఇప్పటివరకు 62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. తడిచిన ధాన్యానికి సైతం మద్దతు ధర కల్పిస్తున్నామని, సన్న వడ్లకు బోనస్ ఇస్తామని భరోసా ఇచ్చారు. బీజేపీ నేతలు ఢిల్లీకి బస్సులు వేసుకుని వెళ్లి ధాన్యం కొనుగోలుకు ఒత్తిడి తేవలన్నారు. లేకుంటే తాము వారి ఇళ్ల ముందుకే ట్రాక్టర్లతో వడ్లు తెచ్చి పోస్తామని ఆయన హెచ్చరించారు. అంతర్రాష్ట్ర జల వివాదాలపై ప్రధాని మోదీ మాటలు చెబుతున్నా, తుమ్మిడిహట్టి కోసం మహారాష్ట్ర సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ఆక్షేపించారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు వడ్లు సరిగ్గా కొనుగోలు చేయడం లేదు. రాష్ట్రంలో 32 శాతం ధాన్యం మాత్రమే కొంటోంది. ధ్యాన్యం కొనకపోతే బీజేపీ నేతల ఇళ్ల ముందు ధాన్యం పోస్తాం. అంతర్రాష్ట్ర జలవివాదాలను సహకార ధోరణితో పరిష్కరించుకోవాలని ప్రధాని మోదీ చెబుతున్నారు. ప్రాణహిత ప్రాజెక్టుపై మహారాష్ట్ర సీఎంతో చర్చలకు ప్రయత్నిస్తున్నాం. ఆయన ఎందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదన్నారు. హరీష్ రావు ఇదులకుంట చెరువు అక్రమాలపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఎన్టీఆర్ విగ్రహం చుట్టూ ప్రాంతీయ, కుల వివాదాలు చేయడం బుద్ధిలేనితనమని, తన దృష్టి అంతా అభివృద్ధి పైనే ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కేసీఆర్ ద ఒట్టేసి.. బీఆర్ఎస్‌లోనే ఉంటానని హరీశ్‌రావు చెప్పాలన్నారు. గతంలోనూ హరీష్ రావు.. వైఎస్సార్ దగ్గరికి వెళ్లారు. ఆయన ఎవరెవరితో మాట్లాడుతున్నారో నాకు తెలుసు.. కానీ చెప్పను. ఇటీవల పార్టీ టింగ్ వదిలేసి ఆయన దిల్లీకి ఎందుకు వెళ్లారు? బీజేపీ, బీఆర్ఎస్‌లు కలిసి పోటీ చేస్తాయనడంలో అనుమానమే లేదు. సీబీఎస్ఈలో జవాబపత్రాలు తారుమారు చేసిన గ్లోబరీనా.. కేటీఆర్ బినా సంస్థ. గ్లోబరీనా సంస్థ కేటీఆర్ బినాదేనని ఆరోపించిన సీఎం అదే ఇప్పుడు పేరు మార్చుకుందన్నారు. 2034 వరకు రాష్ట్ర రాజకీయాల్లోనే ఉంటాను. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, నాది విజయవంతమైన కాంబినేషన్. మేం అన్ని ఎన్నికలు గెలిచాం. భవిష్యత్తులోనూ విజయం సాధిస్తాం. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆయనకు మంచి పదవి రావొచ్చు. జీహెచ్ఎంసీ ఎన్నికలకు ఇప్పుడే తొందర లేదు. ఎన్టీఆర్‌ను కులం, ప్రాంతంతో పోల్చడం బుద్ధిలేనితనం. పొట్టి శ్రీరాములు వర్సిటీకి సురవరం పేరు పెట్టిందే నేను. వివాదాలు, సెంటిమెంట్‌తో రాజకీయాలు చేయాలని అనుకోవడం లేదని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు.

**ఉదయంపూటే ఆవిర్భావ దిన వేడుకలు : సీఎం ఆదేశాలు**

మండుటెండల కారణంగా ఈసారి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఉదయంపూట నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జూన్ 2న సికింద్రాబాద్ పేరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే వేడుకలను ఉదయం 8.30కే ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. జాతీయ పతాకావిష్కరణతోపాటు అవతరణ ఉత్సవ కార్యక్రమాలను గంటన్నర వ్యవధిలో పూర్తి చేయాలశ్రీవప్త్రశ్రీరు. ఎండ తీవ్రత దృష్ట్యా వేడుకలకు హాజరయ్యే అతిథులకు, ప్రజలకు ఇబ్బంది లేకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.

# చదువే ప్రపంచాన్ని మార్చే ఆయుధం


**మొదటిపేజీ తరువాయి**

జిల్లా కలెక్టరేట్‌లో మహిళా వారోత్సవాల సందర్భంగా శనివారం నిర్వహించిన స్నేహ సంఘాల మాక్ పార్లమెంట్, అమ్మకు అక్షర మాల, అంగన్‌వాడీ యూనిఫాంల పంపిణీ కార్యక్రమాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఒక లక్ష్యంతో ముందుకు సాగాలని మహిళలకు పిలుపునిచ్చారు. నెల్సన్ మండేలా చెప్పిన ప్రపంచాన్ని మార్చే శక్తి విద్యకు ఉంది అనే సూక్తిని ప్రస్తావించిన మంత్రి, చదువుతోపాటు సంస్కారం కూడా జీవితంలో అంతే ముఖ్యమని తెలిపారు. తల్లిదండ్రులను, గురువులను గౌరవించడం, సమాజంతో మమేకం కావడం, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడం అవసరమని సూచించారు. స్నేహ సంఘాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా లక్ష మంది టీనేజీ బాలికలను పదివేలకుపైగా స్నేహ గ్రూపులుగా ఏర్పాటు చేసి భద్రత, ఆరోగ్యం, పోషకాహారం, విద్య, సాధికారత అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మొబైల్ ఫోన్లకు బానిసలు కాకుండా వాటిని విద్య, వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాల అభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. పెళ్లి అయినా, వృద్ధాప్యం వచ్చినా మీతో ఉండేది మీ చదువు, మీ విజ్ఞానం మాత్రమే అంటూ ప్రతి బాలిక ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించే దిశగా కృషి చేయాలని కోరారు. అంగన్‌వాడీ యూనిఫాంల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతూ గర్భధారణ దశ నుంచి మూడేళ్ల వయస్సు వరకు పిల్లల పోషకాహార అవసరాలను దృష్టిలో ఉంచుకుని అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. యూనిఫాంలను ప్రజా ప్రభుత్వం అందిస్తున్నదని, 57 రకాల విద్య, ఆట వస్తువులను పంపిణీ చేస్తున్నదని చెప్పారు. తొలి ముద్ద కార్యక్రమం ద్వారా అల్పాహారం, పాలు, గుడ్లు, పోషకాహారం అందిస్తున్నామని వివరించారు. ప్రైవేట్ నర్సరీల్లో అన్నం, పాలు, గుడ్లు ఇవ్వరు.. కానీ ప్రభుత్వ అంగన్‌వాడీల్లో పిల్లల సమగ్ర అభివృద్ధికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం అని చెప్పారు. ప్రైవేటు బడి వద్దు.. అంగన్‌వాడి ముద్దు అని మంత్రి అన్నారు. అంగన్‌వాడీ విద్య పూర్తి చేసుకుని మొదటి తరగతిలో చేరుతున్న చిన్నారులకు విద్యారంభ ధ్రువపత్రాలను మంత్రి అందజేశారు. స్నేహ సంఘాల మాక్ పార్లమెంట్‌లో బాలికలు విద్య, ఆరోగ్యం, సైబర్ భద్రత, రవాణా, పాఠశాల మౌలిక వసతులు, మహిళా ఉపాధ్యాయుల నియామకం, శానిటరీ న్యాప్‌కిన్ల పంపిణీ తదితర అంశాలపై ప్రశ్నలు సంధించారు. ప్రభుత్వ పథకాలపై సంబంధిత అధికారులు సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో బాలికలు తమ సమస్యలను ధైర్యంగా వ్యక్తపరిచే వేదికగా స్నేహ సంఘాలు నిలుస్తున్నాయని అన్నారు. మహిళల అక్షరాస్యత పెంపు కోసం చేపట్టిన అమ్మకు అక్షరమాల కార్యక్రమం ద్వారా లక్షలాదిమంది మహిళలు చదవడం, రాయడం నేర్చుకుని వేలిముద్రకు బదులు సంతకం చేసే స్థాయికి చేరుకున్నారని అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, మహిళా కమిషన్ సభ్యురాలు సదాలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్, శాఖ డైరెక్టర్ శృతి ఓజా, పంచాయతీరాజ్ కమిషనర్, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి, జిల్లా అధికారులు, స్నేహ సంఘాల సభ్యులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



# కాంగ్రెస్ కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం

- చిన్న కాంట్రాక్టర్లకు నిధులు, టెండర్లపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- జీవో 17 రద్దయ్యే వరకు పోరాటం ఆపేది లేదు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కాంట్రాక్టర్ల మహా ధర్నాలో కేటీఆర్



**హైదరాబాద్, మే 30 :**

ఎన్నికలకు ముందు 13 డిక్లరేషన్లు, 6 గ్యారంటీలు, 420 హామీలతో మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాలను నట్టేట ముంచిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద శనివారం జరిగిన మహా ధర్నాలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.ఎన్నికల ముందు చేవెళ్ల, కామారెడ్డి డిక్లరేషన్ల పేరుతో ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ఎస్సీలకు 18, ఎస్టీలకు 12, బీసీలకు 42 శాతం (మొత్తం 72 శాతం) రిజర్వేషన్లు ఇస్తామని నమ్మబలికారని, అధికారంలోకి వచ్చాక 72 పైసలు కూడా ఇవ్వకుండా అడ్డగోలు జీవోలు తెచ్చారని మండిపడ్డారు. చివరికి గురుకుల పాఠశాలల్లో స్థానిక కాంట్రాక్టర్లు సరఫరా చేసే కూరగాయలు, చికెన్, పాలు, బ్రెడ్ వంటి వాటిని కూడా దక్కకుండా చేస్తూ జీవో నెం.17 తీసుకొచ్చి ఆ టెండర్లను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. చిన్న కాంట్రాక్టర్లను రోడ్లపైకి తెచ్చిన జీవో 17 రద్దయ్యే వరకు, బడుగు, బలహీనవర్గాలకు కాంట్రాక్టులు దక్కే వరకు పోరాటం ఆపేది లేదని కేటీఆర్ స్పష్టం చేశారు.

**నిధులు, టెండర్లపై శ్వేతపత్రం విడుదల చేయాలి**

రాష్ట్రంలో కాంట్రాక్టులు కేవలం ఇద్దరికే దక్కుతున్నాయని, రేవంత్ రెడ్డి బావమరికి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కొడుకుకే ఇస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. సీఎం నియోజకవర్గం కొడంగల్‌నారాయణపేట ఎత్తిపోతల పథకానికి సంబంధించిన రూ.4 వేల కోట్ల కాంట్రాక్టును తన అనుయాయులకే ఇచ్చుకున్నారని విమర్శించారు. కేవలం వాళ్ల బంధువులకే కాక బీజేపీ ఎంపీ సీఎం రమేష్‌కు రూ.1300 కోట్ల కాంట్రాక్టులు ఇస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి ఇప్పటివరకు రూ.4 లక్షల కోట్ల అప్పు చేశారని, అందులో రూ.4 అయినా ఎస్సీ, ఎస్టీ, బీసీ కాంట్రాక్టర్లకు ఇచ్చారా అని ప్రశ్నించారు. చిన్న కాంట్రాక్టర్లకు విడుదల చేసిన నిధులు, చేసిన అప్పులపై శ్వేతపత్రం విడుదల చేసే దమ్ము రేవంత్ సర్కార్‌కు ఉందా అని కేటీఆర్ సవాల్ విసిరారు.

**రేవంత్ రెడ్డి రెన్యువల్ సీఎం మాత్రమే**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని, కేవలం రెన్యూవల్ సీఎం అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ హైకమాండ్‌కు నెలనెలా కప్పం పంపి తన కుర్చీని కాపాడుకుంటున్నారని, దిల్లీకి బ్యాగులు మోసినన్ని రోజులు మాత్రమే ఆయన ఉద్యోగం ఉంటుందని వ్యాఖ్యానించారు. తెలంగాణ బడుగులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నా దిల్లీ హైకమాండ్ మౌనంగా ఉండటానికి ఇదే కారణమన్నారు. ఈ ద్రోహానికి రేవంత్‌తోపాటు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలను కూడా నిలదీయాలని పిలుపునిచ్చారు.

**కేసీఆర్ హయాంలో సంపద సృష్టి**

బీఆరఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ సంపద సృష్టించాలిపేదలకు పంచాలి అనే దృక్పథంతో పనిచేశారన్నారు. నాడు చిన్న కాంట్రాక్టర్లను ఆదుకుని గౌరవంగా నిలబెట్టారని గుర్తు చేశారు. కేసీఆర్ అప్పులు చేసి వెయ్యికిపైగా గురుకులాలు కట్టించి 6.50 లక్షల మంది బడుగు విద్యార్థులకు ఒక్కొక్కరిపై రూ.1.20 లక్షల నుండి రూ.1.25 లక్షల వరకు ఖర్చు పెట్టి కార్పొరేట్ స్థాయి ఉచిత విద్య, బూట్లు, బట్టలు, నాణ్యమైన భోజనం అందించారన్నారు. అప్పులతోనే కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని, జిల్లాకో మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ తెచ్చారని, 24 గంటల కరెంట్, కేసీఆర్ కిట్, 15 లక్షల మంది ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి కింద ఆర్థిక సాయం అందించారని తెలిపారు. రూ.72 వేల కోట్ల రైతుబంధు సాయాన్ని నేరుగా ఖాతాల్లో వేశారని గుర్తు చేశారు. తనకు చేతగాక కేసీఆర్ అప్పులు చేశాడని రేవంత్ రెడ్డి అవాకులు చవాకులు పేలుతున్నాడని మండిపడ్డారు.

**2028లో మన ప్రభుత్వమే వస్తుంది**

మక్కలు, వడ్లు కొనుగోలు కాక రైతులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, ఏ ఊరికైనా కాంగ్రెస్ వాళ్లు వెళ్లే ధైర్యం ఉందా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి కర్రుకాల్చి వాత పెట్టి, బొంద పెట్టాలని ప్రజలు ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. మైనర్ బాలికకు అన్యాయం జరిగితే ఆరఎస్ ప్రవీణ్ కుమార్ ఎ పోరాడారో బడుగుల సమస్యలపై కూడా అలాగే పోరాడతామన్నారు. బడుగువర్గాల సమస్యలపై అధికారులకు, మంత్రులకు వినతిపత్రాలు ఇవ్వాలని, ఒకవేళ వాళ్ళు వినకపోతే భవిష్యత్తులో దిల్లీ వేదికగా పోరాడతామని హెచ్చరించారు. 2028లో తప్పకుండా బీఆరఎస్ ప్రభుత్వమే వస్తుందని, నాడు 10 వేల మంది కాదు దాదాపు 50 వేల మంది బడుగు, బలహీనవర్గాల యువకులను కాంట్రాక్టర్లుగా తీర్చిదిద్దే బాధ్యతను కేసీఆర్ తీసుకుంటారని కేటీఆర్ అభయమిచ్చారు.

**న్యాయవాది ఖాజా కుటుంబానికి కేటీఆర్ పరామర్శ**

మాసాబ్ ట్యాంక్‌లో ఇటీవల దారుణ హత్యకు గురైన ప్రముఖ న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ నివాసాన్ని కేటీఆర్ శనివారం సందర్శించారు. లాయర్ మొయినుద్దీన్ అకాల మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన కేటీఆర్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట బీఆరఎస్ సీనియర్ నాయకులు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, తలసాని సాయికిరణ్ యాదవ్‌తోపాటు పలువురు ముఖ్య నేతలు, కార్యకర్తలు ఉన్నారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. సమాజంలో శాంతి భద్రతలను కాపాడటంలో కీలక పాత్ర పోషించే ఒక న్యాయవాదిని హత్య చేయడం అత్యంత విచారకరమని, ఈ ఉదంతాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈ ఘోర ఉదంతంపై ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం తక్షణమే స్పందించి పూర్తిస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, ఈ కేసును వేగంగా విచారించి బాధ్యులకు తగిన శాస్తి జరిగేలా చూడాలని కోరారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా న్యాయం చేయాలని, వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ కష్టసమయంలో బీఆర్ఎస్ పార్టీ మొయినుద్దీన్ కుటుంబానికి అండగా ఉంటుందని, వారికి న్యాయం జరిగే వరకు పోరాడతాని స్పష్టం చేశారు.



# చెరువు అభివృద్ధి పేరుతో భారీ కుట్ర..

**హైదరాబాద్, మే 30 :**

హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో జలవనరుల పరిరక్షణపై దృష్టి సారించిన హైడ్రా, రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాల్‌గూడ-నార్సింగి పరిధిలోని ముష్కిన్ చెరువులో భారీ స్థాయిలో చేపట్టిన చర్యలతో మరోసారి చర్చనీయాంశంగా మారింది. చెరువు ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై శనివారం ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించి వాటిని తొలగించింది.

అధికారుల వివరాల ప్రకారం, ముష్కిన్ చెరువు అభివృద్ధి పేరుతో చెరువు మధ్యభాగంలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించారు. చెరువులో మట్టి పోసి ఎంబ్యాంక్‌మెంట్ నిర్మించడం ద్వారా జలవనరుల విస్తీర్ణాన్ని తగ్గించే ప్రయత్నం జరిగినట్లు నిర్ధారించారు. దీంతో హైడ్రా బృందాలు రంగంలోకి దిగి జేసీబీల సహాయంతో అక్రమ నిర్మాణాలను తొలగించాయి.

హెచ్ఎండిఏ రికార్డుల ప్రకారం ముష్కిన్ చెరువు 52.20 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా, రెవెన్యూ రికార్డుల్లో 59.11 ఎకరాలుగా నమోదై ఉంది. ఇందులో సుమారు 20.23 ఎకరాల ప్రభుత్వ భూమి కూడా ఉంది. ఈ భూములపై ఆక్రమణల ప్రయత్నాలు జరిగినట్లు గుర్తించిన అధికారులు వాటిని అడ్డుకునేందుకు చర్యలు చేపట్టారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో గుడిసెలు ఏర్పాటు చేసి ఆక్రమణలకు ప్రయత్నించిన వారిని గతంలోనే గుర్తించిన హైడ్రా అధికారులు నోటీసులు జారీ చేశారు. అనంతరం సంబంధిత వ్యక్తులు స్వచ్ఛందంగా స్థలాలను ఖాళీ చేయడంతో, అధికారులు ఎలాంటి ఆటంకం లేకుండా ఆక్రమణలను తొలగించారు. పర్యావరణ నిబంధనలను ఉల్లంఘిస్తూ చేపట్టిన నిర్మాణాలపై కూడా హైడ్రా దృష్టి సారించింది. చెరువు విస్తీర్ణాన్ని తగ్గించేలా చేపట్టిన పనులపై విచారణ కొనసాగుతోంది. చెరువు సరిహద్దులను స్పష్టంగా గుర్తించి, భవిష్యత్తులో ఎలాంటి ఆక్రమణలు జరగకుండా ఫెన్సింగ్ పనులు ప్రారంభించారు. ముష్కిన్ చెరువులో చేపట్టిన ఈ ఆపరేషన్‌తో ప్రభుత్వ భూములు, జలవనరుల పరిరక్షణ విషయంలో రాజీ ఉండదనే సంకేతాన్ని హైడ్రా ఇచ్చింది. నగర పరిసర ప్రాంతాల్లోని ఇతర చెరువులు, కుంటలపై కూడా ఇదే తరహా చర్యలు కొనసాగనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

# కొనుగోలు కేంద్రాల్లో రైతుల గోస

**సిద్దిపేట, మే 30:**

రాష్ట్రంలో రైతుల పరిస్థితి రోజురోజుకూ దయనీయంగా మారుతోందని, కొనుగోలు కేంద్రాల్లో అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు మండిపడ్డారు. సిద్దిపేట జిల్లాలోని సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన వడ్లు పోసి 50 రోజులుగా ఎదురుచూస్తున్న రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన హరీశ్‌రావు, కేంద్రంలో ఇంకా 40 నుంచి 50 లారీల మేర ధాన్యం పేరుకుపోయి ఉండగా ఆరు రోజులకో లారీ పంపడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిల్లర్లు క్వింటాల్‌కు ఐదారు కిలోల వరకు కటింగ్‌లు పెడుతూ రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. తక్షణమే కొనుగోళ్లు వేగవంతం చేసి, కటింగ్‌లు లేకుండా ధాన్యం దిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను హెచ్చరించారు.రైతులు ఇన్ని రోజులు కష్టపడి పండించిన ధాన్యాన్ని బీగ్రేడ్‌గా చూపించి వేల రూపాయల నష్టం కలిగిస్తున్నారని అన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతులు ధాన్యం అమ్ముకోవడానికి ఇలాంటి ఇబ్బందులు పడలేదని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మిల్లర్ల దయాధర్మాలపై వదిలేసిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఎరువుల ధరలు పెంచగా, రాష్ట్ర ప్రభుత్వం కొనుగోళ్లలో విఫలమై రైతులను రెండు వైపులా నష్టపరుస్తోందని అన్నారు. వెంటనే రైతుల సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా రైతు ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు.

**పోచమ్మ ఆశీస్సులతో మంచి రోజులు రావాలి**

సిద్దిపేట రూరల్ మండలం తొర్నాలలో నిర్వహిస్తున్న పోచమ్మ దేవాలయ ఉత్సవాల్లో హరీశ్‌రావు పాల్గొన్నారు. గ్రామస్తులు డప్పు చప్పుళ్లు, హారతులతో ఘన స్వాగతం పలకగా, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, గ్రామ దేవత పోచమ్మ తల్లి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, రైతులు పాడిపంటలతో సస్యశ్యామలంగా ఉండాలని ప్రార్థించారు.తొర్నాల గ్రామ దేవాలయ నిర్మాణానికి తాను ఆర్థిక సహాయం అందించడంతో పాటు గ్రానైట్, సిమెంట్ వంటి నిర్మాణ సామగ్రి కూడా సమకూర్చినట్లు తెలిపారు. గ్రామంలో కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్లు, గ్రామ ఆర్చ్ పునర్నిర్మాణం, మొక్కజొన్న పరిశోధనా కేంద్రం, పాలిటెక్నిక్ కళాశాల వంటి అభివృద్ధి కార్యక్రమాలు తమ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని గుర్తుచేశారు. కాళేశ్వరం జలాలు రావడంతో గ్రామంలో వ్యవసాయం అభివృద్ధి చెందినప్పటికీ, ప్రస్తుతం రైతులు పండించిన పంటను అమ్ముకోవడానికే ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో రైతులకు మళ్లీ మంచి రోజులు రావాలని పోచమ్మ తల్లిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

సాగునీటి సమస్యల పరిష్కారానికి శ్రీకారం హరీశ్‌రావు శనివారం నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. రైతుల సాగునీటి సమస్యలను పరిష్కరించే దిశగా రాఘవపూర్లోని ఇంద్రగూడెం తూము మరమ్మత్తు పనులను హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.వ్యవసాయానికి నీరే ప్రాణాధారమని పేర్కొన్న హరీశ్‌రావు, రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా నిరంతరం కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'రైతు డిస్కం' పేరుతో పగటిపూట విద్యుత్ సమస్య వస్తే పావుగంటలో స్పందించిన బీఆర్ఎస్ పాలన ఎక్కడ.. రైతులను గాలికొదిలేసిన ఈ కాంగ్రెస్ పాలన ఎక్కడ అంటూ రైతులు ఆవేదన చెందుతున్నారని హరీష్‌రావు అన్నారు. నంగునూరు మండలం మీదుగా వెళ్తూ మార్గమధ్యలో ముండ్రాయిలో ఆగి రైతులతో ముచ్చటించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను రైతులు చెప్పుకున్నారు. వారి ఆవేదనను విన్న హరీశ్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై మండిపడ్డారు. కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం తెస్తున్న రైతు డిస్కం వల్ల రైతుల ఉచిత విద్యుత్‌కు ఉరితాడు పడబోతోందన్నారు. రైతు డిస్కంకు సోలార్ పవర్ మాత్రమే కేటాయిస్తారు.. అంటే పొద్దున సూర్యుడు వచ్చిన తర్వాతే మోటార్లు ఆన్ అవుతాయి, సాయంత్రం 5 గంటలకు ఎండ పోగానే మోటార్లు బంద్ అవుతాయి.. దీనివల్ల రైతులకు 7 నుంచి 8 గంటల కరెంటు మాత్రమే వస్తుంది అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇక్కడి భూముల ధర ఎకరాకు రూ.50 లక్షలు పలికేది.. కాంగ్రెస్ పాలనలో పాతాళానికి పడిపోయాయని అన్నారు. రూ.30 లక్షలకు ఇస్తామన్నా కొనే నాథుడు లేడన్నారు. తన కొడుకు పైలట్ చదువు ఫీజు కట్టడానికి భూమి అమ్ముకుందామంటే ఎవరూ కొనట్లేదని స్వయంగా మాజీ సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేయడం ఈ ప్రభుత్వ అసమర్థతకు అద్దం పడుతోందన్నారు.

# గిరిజన గురుకులాలు దేశానికే ఆదర్శం

**మొదటిపేజీ తరువాయి**



ఇస్తోందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. నేడు ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు రేపు దేశ ఆర్థిక వ్యవస్థకు, రాష్ట్రాభివృద్ధికి, కుటుంబాల ఆర్థిక సాధికారతకు ప్రధాన శక్తిగా మారుతారని అన్నారు. 'జనజాతీయ గరిమ ఉత్సవ్‌బిర్సా లివ్స్ ఇన్ న్యూ భారత'లో భాగంగా బాబూ జగ్జీవన్ రామ్ భవన్‌లో శనివారం నిర్వహించిన టీజీటీడబ్ల్యూఆరఈఐఎస్, ఈఎంఆరఎస్, ఆశ్రమ పాఠశాలల వార్షిక విజయోత్సవ సభలో మంత్రి అడ్లూరి ముఖ్య అతిథిగా ప్రసంగించారు. భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం పరీక్షా ఫలితాల వేడుక మాత్రమే కాదని, గిరిజన విద్యార్థుల ఆత్మవిశ్వాసం, పట్టుదల, ప్రతిభ, సాధికారతకు ప్రతీకగా నిలుస్తోందని అన్నారు.

**విద్య ద్వారానే సామాజిక న్యాయం**

రాష్ట్రంలో సామాజిక న్యాయం కేవలం నినాదం కాదని, విద్య ద్వారా పేద వర్గాలకు సాధికారత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి అడ్లూరి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టిలో విద్యే పేదరిక నిర్మూలనకు అత్యంత శక్తివంతమైన ఆయుధమని, ప్రతి పేద విద్యార్థి ప్రపంచ స్థాయి అవకాశాలు అందుకునేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు. ఒక విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగం సాధిస్తే కేవలం ఆ కుటుంబం మాత్రమే కాదు.. ఒక తరం అభివృద్ధి చెందుతుందని, వేలాదిమంది విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకుంటే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుందని పేర్కొన్నారు. అందుకే విద్యారంగంలో ప్రభుత్వం భారీ పెట్టుబడులు పెడుతోందని చెప్పారు.

**దేశానికి ఆదర్శంగా గిరిజన గురుకులాలు**

తెలంగాణ గిరిజన గురుకులాలు దేశవ్యాప్తంగా ఆదర్శ విద్యాసంస్థలుగా నిలుస్తున్నాయని మంత్రి తెలిపారు. 82 వేల మందికి పైగా విద్యార్థులకు నాణ్యమైన ఉచిత నివాస విద్య అందిస్తున్న ఈ సంస్థలు కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా నిలుస్తున్నాయని చెప్పారు. ఈ విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ ఫలితాల్లో 98.86 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా 56 విద్యాసంస్థలు వంద శాతం ఫలితాలు సాధించాయని తెలిపారు. ఇంటర్‌లో 86.53 శాతం ఉత్తీర్ణత సాధించడం విశేషమన్నారు. జేఈఈ, నీట్, ఈఏపీసెట్ తదితర జాతీయస్థాయి పరీక్షల్లో విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరుస్తున్నారన్నారు.

**ధర్మపురిలో బాలికల సైనిక్ స్కూల్‌కు ప్రతిపాదనలు**

ధర్మపురి నియోజకవర్గంలోని గిరిజన బాలికల కోసం ఆరో తరగతి నుంచి డిగ్రీ వరకు సమగ్ర విద్య అందించే సైనిక్ స్కూల్, డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు మంత్రి వెల్లడించారు. ఈ ప్రతిపాదనలకు త్వరలోనే ఆమోదం లభించనుందని తెలిపారు.

**ఉద్యోగులకు ప్రభుత్వం వరాలు**

గిరిజన సంక్షేమ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న 1,185 మంది పార్ట్‌టైం ఉద్యోగుల గౌరవ వేతనాల పెంపునకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని మంత్రి తెలిపారు. ప్రిన్సిపాల్ గ్రేడ్2 నుంచి గ్రేడ్1 వరకు ప్రమోషన్ అవకాశాలను 70 శాతం నుంచి 100 శాతానికి పెంచుతూ సవరణలు చేపట్టిందన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్స్‌కు నెలకు రూ.5,000 ప్రత్యేక గౌరవ వేతనం, డిప్యూటీ వార్డెన్లకు ప్రత్యేక భత్యం పెంపు, వైస్ ప్రిన్సిపాల్స్‌కు అదనపు ప్రోత్సాహక భత్యాల మంజూరుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని వివరించారు.

**మౌలిక వసతులకు భారీ నిధులు**

గురుకులాల్లో విద్యార్థులకు మరిన్న మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని మంత్రి పేర్కొన్నారు. రూ.72.83 కోట్లతో మరమ్మతులు, నిర్వహణ పనులకు అనుమతులు మంజూరు చేసినట్లు, ఆధునిక మాడ్యులర్ కిచెన్ల ఏర్పాటుకు రూ.25 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారంతో కూడిన భోజనం అందించాలన్న లక్ష్యంతో అన్ని విద్యాసంస్థలకు ఎఫఎసఎసఏఐ నుంచి 'ఈట్ రైట' సర్టిఫికేషన్ సాధించినట్లు చెప్పారు. పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం రూ.565.32 కోట్లు విడుదల చేశామన్నారు.

**పరిశోధన, ఆవిష్కరణలకు ప్రోత్సాహం**

విద్యార్థులను ప్రపంచస్థాయి అవకాశాలతో అనుసంధానించేందుకు పలు ప్రముఖ జాతీయ, సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నామని మంత్రి తెలిపారు. సీఎసఐఆర్‌ఐఐసీటీతో కలిసి రీసెర్చ్, ట్రైనింగ్, అకడమిక్ ఎక్స్చేంజ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గాంధీ మెడికల్ కాలేజ్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ భాగస్వామ్యంతో రూ.1.30 కోట్లతో అనీమియా ముక్త్ భారత్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ ప్రజాగాయకుడు నరసయ్య (నల్గొండ గద్దర్) ఆలపించిన అంబేద్కర్ గీతం విద్యార్థులను ఉత్తేజపరిచింది. గిరిజన సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లో ఎసఎస్‌సి, ఇంటర్, ఐఐటి, జేఈఈ, నీట్‌లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన, అలాగే విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులను మంత్రులు మెమెంటోల,Tశాలువలతో నగదు పురస్కారాలు ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు. హైదరాబాద్ ఇన్‌చార్జి, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ, విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు నవీన్ యాదవ్, వెడ్మా బొజ్జు, టీజీటీడబ్ల్యూఆరఈఐఎస్ కార్యదర్శి సీతాలక్ష్మి, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, టీసీఆర్ అండ్ టీఐ డైరెక్టర్ డాక్టర్ సముజ్వల, సీఎసఐఆర్‌ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

**విద్యార్థులకు మంత్రి సీతక్క అభినందన**

మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రతి విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోని సాధారణ పాఠశాలలను అధిగమించి అద్భుత ఉత్తీర్ణత శాతం సాధిస్తున్న విద్యార్థులను హృదయపూర్వకంగా అభినందిస్తున్నానన్నారు. గిరిజన ప్రాంతాల గురించి మాట్లాడినప్పుడు అక్షరాస్యతలో వెనుకబడి ఉంటారని చాలామంది భావిస్తారు. అది గతంలో.. ఇప్పుడు పరిస్థితులు మారాయి.. ఈసారి టెన్త్ ఫలితాల్లో ములుగు జిల్లా 99.30 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. గతసారి ఇంటర్ ఫలితాల్లో మొదటి స్థానం సాధించాం. ఈసారి రెండో స్థానంలో నిలిచాం. ఇంకా మెరుగైన ఫలితాల కోసం కృషి చేయాలి అని సూచించారు. మహబూబాబాద్, ములుగు, ఆసిఫాబాద్ వంటి గిరిజన జనాభా అధికంగా ఉన్న జిల్లాల్లో మంచి ఫలితాలు రావడం సంతోషకరమన్నారు. ములుగు జిల్లా సాధించిన అద్భుత ఫలితాలు ఒక ఆదివాసి బిడ్డగా నాకు ఎంతో గర్వాన్ని కలిగిస్తున్నాయన్నారు. ఈసారి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చరిత్ర సృష్టించారన్నారు. చెంచుపెంటల్లో, దళితవాడల్లో, గిరిజన తండాల్లో మీ విజయాల గురించి చర్చ జరిగితే అక్కడి పిల్లలు కూడా ఉన్నత లక్ష్యాలు పెట్టుకుని ముందుకు సాగుతారు. సమాజంలో అసమానతలు తగ్గి అందరికీ సమాన అవకాశాలు లభించే సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని మంత్రి సీతక్క విద్యార్థులకు ఉద్బోధించారు.

# పేదవాని గుమ్మం వద్దకు ప్రభుత్వ పథకాలు

**మొదటిపేజీ తరువాయి**

పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. త్వరలో క్యూర్ పరిధిలో తొలివిడతగా మంజూరు చేసిన లక్ష ఇళ్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయడమేగాక ఏడాది తిరిగిలోగా వాటి నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. బంజారాహిల్స్‌లో నిర్మించబోయే ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సముదాయానికి మంత్రి పొంగులేటి సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్‌లతో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ముఖ్య అతిథిగా మాట్లాడుతూ గత బీఆరఎస్ ప్రభుత్వం వలే ప్రజలు ఒకచోట ఉంటే ఇళ్లు 3040 కిలోమీటర్ల అవతల ఉండేలా చేయబోమని, ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని ఏ నియోజకవర్గ ప్రజలకు ఆ నియోజకవర్గంలోనే ఇళ్లు నిర్మిస్తామని, ఇది పేదలకు పెద్దన్న, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కానుకగా అందిస్తామని వివరించారు. రాష్ట్రంలో పేదవాని గుమ్మం వద్దకే ప్రజా ప్రభుత్వ పథకాలు చేరేలా కృషి చేస్తున్నామన్నారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సర్వే తదితర శాఖలు ఒకేచోట అందుబాటులోకి తెచ్చేలా ఈ సమీకృత భవనాల నిర్మాణం చేపడుతున్నామన్నారు. తమ ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలలో భాగంగా మూడు కార్పొరేషన్ల పరిధిలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను కార్పొరేట్ తరహాలో అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు. అంతేగాక ప్రభుత్వానిపై ఈ నిధుల భారం పడకుండా రియల్ ఎస్టేట్ నిర్మాణరంగంలో ప్రసిద్ధమైన సంస్థలకు నిర్మించే బాధ్యత అప్పగిస్తున్నామన్నారు. మరి కొద్ది నెలల్లో ఇక్కడ ఫినిక్స్ సంస్థ 30వేల చదరపు అడుగుల్లో ఈ భవనాన్ని పూర్తి చేసి ఇస్తుందని వెల్లడించారు. బంజారాహిల్స్ సమీకృత భవనంలో ఎస్.ఆర్.నగర్, బంజారాహిల్స్, గోల్కొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, డీఐజీ కార్యాలయం, రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ - గోల్కొండ కార్యాలయాలు వస్తాయని, వీటివల్ల ఈ ప్రాంత ప్రజలకు మరిన్ని ఉద్యోగ, వ్యాపార సౌకర్యాలు కలుగుతాయని చెప్పారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ అధ్యక్షత వహించగా ఎంపీ సునీల్ యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యే నవీన్ యాదవ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారులకు తగిన గుర్తింపు

**మొదటిపేజీ తరువాయి**


సమావేశం అయ్యింది. కమిటీ సభ్యులు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అద్దంకి ద యాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదం డరామ్, మాజీ ఎమ్మెల్సీ ఎస్.రాములు నాయ క్, మోతే శోభన్ రెడ్డిలు సంబంధిత ఉన్నతాధి కారులతో జరిపిన ఈ సమావేశంలో విధివిధానాలు, ఉద్యమకారుల సమాచార సేకరణ తదితర అంశాలపై చర్చించారు. ఉద్యమ కారుల గుర్తింపు, గౌరవం కోసం ప్రభుత్వం కమిటీ వేస్తూ ఈ నెల 15న జీవో 679 జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈ కమిటీ సచి వాలయంలో మొదటిసా రి సమావేశమైంది. జూన్ 4న అన్ని పార్టీల ప్రతి నిధులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి తగు సూచనలు, సలహాలు స్వీకరించాలని నిర్ణయించింది. అమరవీరుల కుటుంబాలు, తెలంగాణ ఉద్యమం తొలి, మలి దశలలో క్షేత్రస్థాయిలో ఉద్యమంలో పాల్గొన్న వారి వివరాలు సేకరించి పారదర్శకంగా అర్హుల జాబితా తయారీకి తగు కార్యాచరణ రూపొందించాలని అధికారులను కమిటీ ఆదేశించింది. ఉద్య మకారుల గుర్తింపు ప్రమాణాలు, జైలు శిక్షలు అనుభవించిన వారు, పలు పోలీసు కేసుల నమోదు, ఉద్యమంలో పాల్గొన్న మేధావులు, కళాకారులు, రచయితలు, ఉద్యోగులు, జర్నలిస్టులు, అడ్వకేట్లు, విద్యార్థులు, ఆర్టీసీ, సింగరేణి కార్మికులు అందరినీ గుర్తించి, సముచితంగా గౌరవించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడం, అలాగే వారి సేవలు, త్యాగాలకు తగిన గౌరవం కల్పించేందుకు ప్రభుత్వం ఈ కమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. రాష్ట్ర సాధనలో విశేష కృషి చేసిన ఉద్యమ కారులకు ప్రభుత్వం తరపున తగిన గౌరవం, గుర్తింపు అందేలా సిఫారసులు చేయాలని కమిటీ నిర్ణయించింది. తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని, సమాచార సేకరణలో ఎటువంటి విమర్శలకు తావు లేకుండా ఉద్య మంలో పాల్గొన్న వారందరిని గుర్తించి సముచితంగా గౌరవించాలనేది ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్, హోం శాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్, జీఏడీ కార్యదర్శి రఘునందన్ రావు, జీఏడీ ప్రొటోకాల్ డైరెక్టర్ హరీష్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి, న్యాయ శాఖ కార్యదర్శి పాపిరెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# తగ్గని ఎండల తీవ్రత



**హైదరాబాద్, మే30:**

రాష్ట్రంలో ఎండలకు తోడు, వడగాలులు కూడా ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అడపాదడపా కొన్నిచోట్ల ఉరుములతో కూడిన వర్షాలు పడుతున్నా, మొత్తంగా ఎండలు మాత్రం శాంతించడం లేదు. రుతుపవానలు కూడా ఆలస్యం అవుతున్నాయి. పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న 'సూపర్ ఎల్‌నినో' ప్రభావంతో జూన్ 1 నుంచి అక్టోబర్ వరకు నైరుతి సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదయ్యే పరిస్థితులు లేవని వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలో భిన్నవాతావరణం కొనసాగుతున్నది. తెల్లవారుజామున, రాత్రివేళలో వర్షం కురుస్తుండగా.. మిగతా సమయంలో ఎండలు దంచికొడుతున్నాయి. 17 జిల్లాల్లో 45 డిగ్రీలకుపై గా గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యాయి. మంచిర్యాల జిల్లా తాండూరులో అత్యధికంగా 46.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. పెద్దపల్లి, వరంగల్ జిల్లాల్లో 46.3 డిగ్రీలు, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, కుమ్రం భీం ఆసిఫాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో 46.2 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తెలుగు రాష్ట్రాల్లో వర్షపాతం కొద్దిగా ఆశించినస్థాయిలో ఉన్నప్పటికీ దేశంలోని ఇతర ప్రాంతాల్లో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఇది దేశవ్యాప్తంగా రుతుపవనాల విస్తరణపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉన్నట్టు వెల్లడించింది. వాతావరణంలో నెలకొన్న ఈ అనిశ్చితి దృష్ట్యా నీటిని పొదుపుగా వాడుకొంటూ, పంటల ప్రణాళికలను రూపొందించు కోవాలని వాతావరణ నిపుణులు హెచ్చరించారు. 2026 నైరుతి రుతుపవనాల కాలానికి సంబంధించిన తుది దీర్ఘకాలిక వాతావరణ అంచనాలను భారత వాతావరణ శాఖ విడుదల చేసింది. ఈ సీజన్‌లో తెలంగాణలో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్టు తెలిపింది. ముఖ్యంగా హైదరాబాద్‌తోపాటు మధ్య తెలంగాణ ప్రాంతంలో భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నట్టు వెల్లడించింది. ఈ వర్షాలు భూగర్భ జలవనరుల పునరుద్ధరణకు ఎంతో ఉపయోగపడుతాయని వివరించింది. సంవత్సరం వానకాలం ఎల్‌నినో ప్రభావంతో 2018 మాదిరిగానే ఉంటుందని వాతావరణ నిపుణులు వెల్లడించారు. తక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. 2025 సంవత్సరం మాదిరి వర్షాలను ఆశించవద్దని తెలంగాణ వెదర్‌మ్యాన్ సూచించారు. జూన్, జూలై నెలల్లో సాధారణ వర్షాలు ఉంటాయని, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో సాధారణంకంటే తక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని అంచనా వేశారు. అయినప్పటికీ.. 201415లా సాధారణ వర్షపాతం 905.4 మి.. కురువాల్సి ఉండగా కేవలం 562.1 మి.. కురిసినంత తీవ్రంగా ఉండకపోవచ్చని తెలిపారు. గత 56 సంవత్సరాలతో పోలిస్తే ఈ సంవత్సరం రుతుపవన వర్షాలు తక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ ఏడాది దక్షిణ, ఉత్తర జిల్లాల్లో వర్షాల లోటు తీవ్రంగా ఉంటుందని, మధ్య తెలంగాణలో మంచి వర్షాలు కురుస్తాయని అంచనా వేశారు. ఈ ఏడాది రెండో వారంలో రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల ఆరంభం ఉంటుందని చెప్పారు.



# జనాభా పెరుగుదల కాదు వసతుల కల్పనే దేశ ప్రగతికి మూలాధారం!

దేశాభివృద్ధి అనగానే చాలామంది జీడీపీ వృద్ధి, పారిశ్రామిక ప్రగతి, సాంకేతిక పురోగతి వంటి అంశాలను ప్రస్తావిస్తారు. కానీ ఒక దేశం నిజంగా అభివృద్ధి చెందిందా లేదా అన్నది అక్కడి ప్రజల జీవన ప్రమాణాలను బట్టి నిర్ణయించాలి. ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య, అందుబాటులో వైద్యం, సురక్షిత నివాసం, ఉపాధి అవకాశాలు, తాగునీరు, పారిశుధ్య సదుపాయాలు, సామాజిక భద్రత అందుతున్నాయా లేదా అన్నదే అసలు కొలమానం. ఈ అంశాల్లో ఇంకా అనేక లోపాలు ఉన్న దేశంలో జనాభా పెంపును ప్రోత్సహించడం ఎంతవరకు సమంజసమన్న ప్రశ్న తలెత్తుతోంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జనాభా పెంపుపై చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. మూడో సంతానానికి రూ. 30 వేలు, నాలుగో సంతానానికి రూ. 40 వేలు ప్రోత్సాహకంగా ఇస్తామని ప్రకటించడం ద్వారా ఎక్కువ మంది పిల్లలను కనాలని పరోక్షంగా ప్రోత్సహించారు. దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా పెరుగుదల తగ్గిపోవడం వల్ల భవిష్యత్తులో పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల పునర్విభజనలో నష్టం జరిగే అవకాశాల నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేసినట్లు భావిస్తున్నారు. అయితే రాజకీయ లాభనష్టాల కంటే ప్రజల జీవన ప్రమాణాలే ముఖ్యమన్న వాస్తవాన్ని పాలకులు మరవకూడదు. ప్రస్తుతం దేశంలో ఉన్న జనాభాకే సరిపడా మౌళిక వసతులు అందుబాటులో లేవన్నది వాస్తవం. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల లేమి, ఉపాధ్యాయుల కొరత సమస్యలు కొనసాగుతున్నాయి. లక్షలాది మంది యువత ఉన్నత విద్య పూర్తిచేసినా ఉపాధి కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. పట్టణాల్లో నివాస సమస్యలు, ట్రాఫిక్ రద్దీ, కాలుష్యం, తగిన మౌలిక వసతుల లేమి రోజురోజుకు పెరుగుతున్నాయి.

దేశంలో ప్రతి సంవత్సరం లక్షలాది మంది యువకులు ఉద్యోగ మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నప్పటికీ, వారికి తగిన ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. నిరుద్యోగం ఇప్పటికే తీవ్రమైన సమస్యగా మారింది. మరోవైపు వ్యవసాయ రంగం కూడా అనిశ్చితితో కొట్టుమిట్టాడుతోంది. రైతులు పంటలకు గిట్టుబాటు ధరలు, సాగునీరు, రుణ సౌకర్యాల కోసం పోరాడాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో జనాభా పెంపు గురించి మాట్లాడటం కంటే ప్రస్తుతం ఉన్న జనాభాను ఉత్పాదక శక్తిగా మార్చే దిశగా చర్యలు తీసుకోవడం అత్యవసరం. జనాభా పెరుగుదల వల్ల ఏర్పడే సామాజిక, ఆర్థిక ప్రభావాలను కూడా విస్మరించరాదు. అధిక జనాభా కారణంగా వనరులపై ఒత్తిడి పెరుగుతుంది. భూమి, నీరు, ఆహార వనరుల వినియోగం పెరుగుతుంది. పర్యావరణంపై అదనపు భారం పడుతుంది. ఇప్పటికే వాతావరణ మార్పులు, నీటి కొరత, పర్యావరణ సంక్షోభం ప్రపంచ దేశాలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో జనాభా నియంత్రణను వదిలేసి పెంపును ప్రోత్సహించడం భవిష్యత్ తరాలపై మరింత భారం మోపే ప్రమాదం ఉంది. మహిళల కోణంలో ఈ అంశాన్ని పరిశీలిస్తే మరిన్ని ఆందోళనకర అంశాలు కనిపిస్తాయి. ఇప్పటికీ దేశంలోని అనేక ప్రాంతాల్లో మహిళలు వివాహం, సంతానం, కుటుంబ బాధ్యతల విషయంలో సామాజిక ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నారు. విద్య, ఉద్యోగం, ఆర్థిక స్వావలంబన దిశగా మహిళలు ముందుకు సాగుతున్న తరుణంలో ఎక్కువ మంది పిల్లలను కనాలని ప్రోత్సహించడం వారిపై అదనపు ఒత్తిడి పెంచే అవకాశం ఉంది. ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో మహిళల ఆరోగ్య పరిస్థితులు ఇంకా ఆందోళనకరంగానే ఉన్నాయి. ప్రసూతి సమయంలో సరైన వైద్యం అందక తల్లీబిడ్డల మరణాలు సంభవిస్తున్న సంఘటనలు ఇంకా కనిపిస్తూనే ఉన్నాయి. పిల్లలను కనమని చెప్పడం సులభమే. కానీ వారికి నాణ్యమైన విద్య, ఆరోగ్యం, భద్రత, ఉపాధి అవకాశాలు కల్పించగలమా అనే ప్రశ్నకు ముందుగా సమాధానం చెప్పాలి. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రజా పంపిణీ వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. పిల్లల పోషణ, విద్య, ఆరోగ్యం కోసం మరిన్ని వనరులు కేటాయించాలి. మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఇవన్నీ చేయకుండా కేవలం నగదు ప్రోత్సాహకాలు ప్రకటించడం సమస్యకు పరిష్కారం కాదు. మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే, జనాభా ఎక్కువగా ఉండటం వల్లే దేశం బలంగా మారుతుందనుకోవడం పొరపాటు. ప్రపంచంలో జనాభా తక్కువగా ఉన్న అనేక దేశాలు అభివృద్ధిలో అగ్రస్థానాల్లో ఉన్నాయి. వారి బలం జనాభా సంఖ్యలో కాదు, మానవ వనరుల నాణ్యతలో ఉంది. విద్యావంతులు, నైపుణ్యం కలిగిన యువత, సమర్థవంతమైన పరిపాలన, నాణ్యమైన మౌళిక వసతులే ఆ దేశాల విజయానికి కారణం. ప్రభుత్వాలు ప్రజల సంఖ్య పెంచడం కంటే ప్రజల జీవన ప్రమాణాలు పెంచడంపై దృష్టి సారించాలి. ప్రతి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రతి పిల్లవాడికి నాణ్యమైన విద్య, ప్రతి యువకుడికి ఉపాధి అవకాశం, ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన జీవనం అందేలా చర్యలు తీసుకోవాలి. మహిళల విద్య, ఉపాధి, భద్రత, ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి. మౌళిక వసతుల అభివృద్ధి, మానవ వనరుల నాణ్యత పెంపు ద్వారానే దేశం నిజమైన అభివృద్ధిని సాధించగలదు. అందుకే నేడు అవసరమైన చర్చ "ఎంత మంది పిల్లలను కనాలి?" అనేది కాదు. "ఇప్పుడున్న ప్రజలకు ఎంత మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించగలుగుతున్నాం?" అనేదే. జనాభా పెంపు కంటే మౌళిక వసతుల కల్పనే దేశ భవిష్యత్తును నిర్ణయించే అసలైన అంశం. ప్రజల అవసరాలను తీర్చగలిగినప్పుడే అభివృద్ధి సార్థకమవుతుంది. లేకపోతే జనాభా పెరుగుదల మరో భారంగా మారే ప్రమాదం ఉంది.

# ఉగ్ర కుట్ర భగ్నం



- ఢిల్లీ, ముంబై, పంజాబ్‌లలో భారీ దాడులకు కుట్ర
- ఐఎస్ఐ, దావూద్ లింకులతో 9 మంది అరెస్ట్
- ఉన్నత విద్యావంతులే సూత్రధారులు!



**ఢిల్లీ:** దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో భారీ ఎత్తున ఉగ్రదాడులు జరపడానికి వ్యూహం రచించిన తొమ్మిది మంది నిందితులను ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు అత్యంత చాకచక్యంగా అరెస్టు చేశారు. పట్టుబడిన ఈ ముఠాకు పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ, అలాగే అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీంతో నేరుగా సంబంధాలు ఉన్నట్లు పోలీసులు ధృవీకరించారు. నిందితులు ఢిల్లీ, ముంబై, పంజాబ్ ప్రాంతాలకు చెందిన వారని, వీరిలో కొందరు విదేశీయులు కూడా ఉన్నారని ఉన్నతాధికారులు వెల్లడించారు. అరెస్ట్ చేసిన సమయాల్లో వారి స్థావరాల నుంచి పలు అధునాతన ఆయుధాలను, పేలుడు పదార్థాలను భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ ఉగ్రవాదులు దేశంలోని కీలక మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకున్నట్లు విచారణలో తేలింది. ముఖ్యంగా అణుకేంద్రాలు, అంతర్జాతీయ విమానాశ్రయాలు, రద్దీగా ఉండే రైల్వేస్టేషన్లు, పవర్‌ప్లాంట్లు వంటి వ్యూహాత్మక ప్రాంతాలపై దాడులు చేయడానికి వీరు స్కెచ్ వేశారు. ప్రజల రక్షణలో ఉండే భద్రతా దళాలను కూడా టార్గెట్ చేసే యోచనలో వీరు ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ ఉగ్రమూక కదలికలపై గత కొంతకాలంగా నిరంతరం నిఘా ఉంచిన పోలీస్ యంత్రాంగం, సరైన సమయంలో దాడి చేసి వీరిని అదుపులోకి తీసుకుంది. ఈ కుట్ర వెనుక పాకిస్థాన్ పాత్ర ఏ మేరకు ఉంది, వీరికి విదేశాల నుంచి అందుతున్న ఆర్థిక వనరులు ఎక్కడి నుంచి వస్తున్నాయి, మరియు వీరిని నడిపిస్తున్న విదేశీ హ్యాండ్లర్లు ఎవరు అనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. రాజధాని ఢిల్లీలో ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందన్న ముందస్తు సమాచారంతో అక్కడి పోలీసులు పూర్తిగా అప్రమత్తమయ్యారు. నిఘా వర్గాలు, కేంద్ర పారామిలిటరీ దళాల సమన్వయంతో అన్ని జిల్లాల పోలీస్ యూనిట్లు హైఅలర్ట్‌లో ఉన్నాయి. గతేడాది ఎర్రకోట వద్ద జరిగిన పేలుడులో 15 మంది మరణించిన ఉదంతాన్ని దృష్టిలో ఉంచుకుని భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ప్రస్తుత కేసులో పట్టుబడిన నిందితులందరూ ఉన్నత విద్యావంతులు కావడంతో, సాంకేతికతను వాడుకుంటూ సాగుతున్న 'వైట్ కాలర్ ఉగ్రవాదం'పై కూడా పోలీసులు గట్టి నిఘా పెట్టారు.



## సాంకేతిక సమస్యతో సీయూఈటీ పరీక్ష ఆలస్యం

### కేంద్రంపై ప్రతిపక్షాల విమర్శలు

**న్యూఢిల్లీ, మే 30:** డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ) శనివారం పలు పరీక్షా కేంద్రాల్లో సాంకేతిక సమస్యల కారణంగా ఆలస్యంగా ప్రారంభమైంది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోగా, కేంద్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించాయి. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ నేత అతిషి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై తీవ్ర విమర్శలు చేశారు. "మొదట నీట్, తరువాత సీబీఎస్ఈ, ఇప్పుడు సీయూఈటీ.. జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణలో కేంద్రం వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది" అని ఆమె సోషల్ మీడియా వేదికగా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కూడా కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. "నాలుగు పరీక్షలు, కోటి మంది విద్యార్థులు.. కానీ ఒక్క పరీక్షను కూడా సక్రమంగా నిర్వహించలేకపోయారు" అని విమర్శించారు. విద్యా వ్యవస్థను దెబ్బతీసే విధంగా కేంద్రం వ్యవహరిస్తోందని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న ప్రభుత్వానికి యువతే తగిన సమాధానం చెబుతారని అన్నారు. ఈ అంశంపై స్పందించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ), కొన్ని కేంద్రాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తిన కారణంగా పరీక్ష ప్రారంభంలో జాప్యం జరిగిందని తెలిపింది. అయితే సమస్యను వెంటనే పరిష్కరించి పరీక్షలను సజావుగా నిర్వహించామని వెల్లడించింది. ఆలస్యాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు అదనపు సమయం కేటాయించినట్లు పేర్కొంది. అదేవిధంగా మధ్యాహ్నం నిర్వహించాల్సిన కొన్ని షిఫ్టుల సమయాల్లో కూడా మార్పులు చేసినట్లు ఎన్‌టీఏ తెలిపింది. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కావాల్సిన పరీక్షను సాయంత్రం 4 గంటలకు వాయిదా వేసినట్లు వెల్లడించింది. కేంద్ర, రాష్ట్ర విశ్వవిద్యాలయాలతో పాటు పలు ప్రైవేటు యూనివర్సిటీల్లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ సీయూఈటీ పరీక్షను నిర్వహిస్తోంది. ఈ ఏడాది పరీక్షలు మే 11 నుంచి మే 31 వరకు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి.

## ఆందోళనకరంగా నకిలీ నోట్ల చలామణి

### ఆర్‌బీఐ నివేదికలో పలు అంశాలు వెల్లడి

**ముంబయి, మే 30:** దేశంలో నకిలీ నోట్ల అంతకంతకూ పెరిగిపోతున్నాయి. దర్యాప్తు అధికారుల సోదాల్లో పెద్ద మొత్తంలో నకిలీ కరెన్సీ పట్టుబడుతుండటమే ఇందుకు నిదర్శనం. బ్యాంకింగ్ వ్యవస్థలో నకిలీ కరెన్సీ నోట్ల గుర్తింపు 2025-26లో 5.7 శాతం పెరిగిందని భారత రిజర్వ్ బ్యాంక్ వెల్లడించింది. దీనికి ఆన్‌లైన లేదా కరెన్సీ రహిత ప్రవాహం పెరగాలని సూచిస్తున్నారు. నోట్ల రద్దు చేసినా నకిలీ నోట్ల ముద్రణ ఆగడం లేదని తెలుస్తోంది. ప్రధానంగా ముఖ విలువ రూ. 200, రూ. 500 ఉన్న నోట్లే ఇందులో ఎక్కువగా వుంటున్నాయని తెలిపింది. 2025-26లో మొత్తంగా నకిలీ నోట్ల సంఖ్య 2,29,746కి పెరిగిందని, అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో ఈ సంఖ్య 2,17,396గా వుందని ఆర్‌బీఐ తన వార్షిక నివేదికలో పేర్కొంది. 2024-25లో నకిలీ రూ. 500 నోట్లు 20.5 శాతం పెరిగాయి. అంతకుముందు 1,17,722 గుర్తించగా, తర్వాత ఆ సంఖ్య 1,41,907కి చేరింది. అలాగే రూ. 20 ముఖ విలువ ఉండే నోట్లు నకిలీ చలామణి కూడా బాగా పెరిగిందని ఆ నివేదిక తెలిపింది. ఏడాది క్రితం 253 నోట్లు బయటపడగా అవి 47.4శాతం పెరిగి 373కి చేరాయి. 200 నకిలీ నోట్ల సంఖ్య తగ్గింది. 2024-25లో 32,600 వుండగా, 2025-26లో 30,591కి పడిపోయింది. అలాగే వంద నోట్ల నకిలీ కూడా తగ్గింది. 51,069 నుండి 45,621కి పడిపోయింది. రూ. 50నోట్లు నకిలీ కూడా 12,015 నుండి 10,274కి తగ్గింది. 2 వేల నోట్లు చలామణి నుండి ఉపసంహరించడంతో వాటి నకిలీ దాదాపు పడిపోయిందని చెప్పవచ్చు. అంతకుముందు ఏడాదిలో 3508 బయటపడగా, 2025-26లో ఈ సంఖ్య 824కి తగ్గిపోయింది. ఆర్ బి ఐలో 2.4శాతం అంటే 5,412 నకిలీ నోట్లు కనుగొనగా ఇతర బ్యాంకుల్లో మొత్తంగా 97.6శాతం అంటే 2,24,334 నోట్లు కనుగొన్నారని నివేదిక పేర్కొంది. ఇంకా పోలీసులు, ఇతర ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నవి ఇందులో కలపలేదని తెలిపింది. పాడైపోయిన నోట్లను తీసివేయడం బాగా తగ్గిందని నివేదిక పేర్కొంది. 2025-26లో ఈ సంఖ్య 1.72లక్షల నోట్లుగా వుండగా అంతకుముందు ఏడాది ఈ సంఖ్య 2.38 లక్షలుగా వుంది.




# ఆపరేషన్ సిందూర్ 2.0కు సిద్ధం..

### పాక్‌కు ఆర్మీ చీఫ్ హెచ్చరిక

**న్యూఢిల్లీ, మే 30:** అవసరమైతే 'ఆపరేషన్ సిందూర్ 2.0' చేపట్టేందుకు భారత సాయుధ దళాలు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నాయని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది స్పష్టం చేశారు. దేశ భద్రతకు ఎలాంటి ముప్పు వచ్చినా సమర్థవంతంగా ఎదుర్కొనే సామర్థ్యం భారత త్రివిధ దళాలకు ఉందని పేర్కొన్నారు. పుణెలో నిర్వహించిన నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ) 150వ పాసింగ్ ఔట్ పరేడ్ అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, శాంతి అనేది తాత్కాలిక పరిస్థితి మాత్రమేనని, అవసరమైతే ఆపరేషన్ సిందూర్ రెండో దశకు కూడా సైన్యం సిద్ధంగా ఉంటుందని తెలిపారు. భవిష్యత్ యుద్ధాలు కేవలం భూమి, సముద్రం, ఆకాశానికే పరిమితం కావని, అంతరిక్షం, సైబర్, కాగ్నిటివ్ డొమెయిన్లలో కూడా పోరాటాలు సాగే అవకాశాలు ఉన్నాయని ద్వివేది పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సైనిక వ్యూహాలు, భద్రతా చర్యలు, సాంకేతిక సామర్థ్యాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు.



ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత సైన్యం తన సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిందని, లక్ష్యాలను కచ్చితత్వంతో ఛేదించే శక్తి తమకు ఉందని నిరూపించిందన్నారు. భవిష్యత్ యుద్ధాల్లో ప్రజల విశ్వాసం, జాతీయ ఐక్యత కూడా కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. గత పదేళ్లలో భారత సాయుధ దళాల సామర్థ్యంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయని, ఇందులో యువత పాత్ర ఎంతో ముఖ్యమని ఆర్మీ చీఫ్ తెలిపారు. ఆధునిక యుద్ధ అవసరాలకు అనుగుణంగా డ్రోన్ బెటాలియన్లు, దివ్యాస్త్ర బ్యాటరీలు, శక్తిమాన్ రెజిమెంట్లు, భైరవ్ బెటాలియన్లు వంటి సాంకేతిక ఆధారిత ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. నెట్‌వర్కింగ్, డేటా ఆధారిత యుద్ధ వ్యూహాలు భవిష్యత్‌లో కీలక వనరులుగా మారనున్నాయని పేర్కొన్న ఆయన, డ్రోన్ల వినియోగంపై అన్ని సైనిక శిక్షణ అకాడమీల్లో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. భారత భద్రతకు ఎలాంటి ముప్పు వచ్చినా తగిన ప్రతిస్పందన ఇవ్వడానికి త్రివిధ దళాలు అప్రమత్తంగా, సర్వసన్నద్ధంగా ఉన్నాయని జనరల్ ఉపేంద్ర ద్వివేది స్పష్టం చేశారు.

# కాళేశ్వరం సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సు సేవలు

**డిపో మేనేజర్ కే. కవిత**

**చెంగిచెర్ల, మే 30, రాజముద్ర న్యూస్ :** కాళేశ్వరం సరస్వతి పుష్కరాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం చెంగిచెర్ల ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సు సేవలను ఏర్పాటు చేయనున్నట్లు డిపో మేనేజర్ కే. కవిత తెలిపారు. ఈ ప్రత్యేక యాత్రను కాలనీ, పట్టణ వాసులు వినియోగించుకోవాలని కోరారు 35 మందికి పైగా భక్తులు ఉంటే వారు కోరిన చోటునుండే బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ యాత్రలో భక్తులను కాలేశ్వరం, పుష్కర ఘాట్, అలాగే భద్రకాళి ఆలయం వంటి ప్రముఖ పుణ్య క్షేత్రాలకు తీసుకెళ్లనున్నట్లు వివరించారు. ప్రయాణానికి మెట్రో డీలక్స్ నాన్ ఏసీ బస్సు అందుబాటులో ఉంటుందని చెప్పారు. టికెట్ ధరలు పెద్దలకు రూ.1000, పిల్లలకు రూ.600గా నిర్ణయించినట్లు తెలిపారు. ప్రయాణికుల కోసం చెంగిచెర్ల, ఉప్పల్ బస్ స్టాప్, మేడిపల్లి ప్రాంతాల్లో పికప్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని భక్తులు వినియోగించుకొని సరస్వతి పుష్కరాల్లో పాల్గొని పుణ్యస్నానాలు ఆచరించాలని డిపో మేనేజర్ కే. కవిత కోరారు. మరిన్ని వివరాల కోసం 91105 05820, 9948886516, 7382823960, 7993291705 నంబర్లను సంప్రదించాలని సూచించారు.



# వికారాబాద్ పట్టణంలో పోలీసుల స్పెషల్ డ్రైవ్

- గంజాయి, మద్యం సీజ్
- తప్పిపోయిన బాలుడు సురక్షితంగా తల్లిదండ్రుల చెంతకు



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు, వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా వికారాబాద్ డీఎస్పీ అంజయ్య ఆధ్వర్యంలో భారీ ప్రత్యేక తనిఖీలు (స్పెషల్ డ్రైవ్) నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా పట్టణంలోని ఒక నిర్మానుష్య ప్రదేశంలో గంజాయి సేవిస్తున్న ఒక వ్యక్తిని పట్టుకొని, అతని వద్ద నుండి సుమారు 2 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందిరానగర్ కాలనీలో కొందరు యువకులు ఒక ఇంటి ముందు గుమిగూడి మద్యం సేవిస్తుండగా గమనించిన పోలీసులు సదరు ఇల్లాన్ని తనిఖీ చేసి అక్కడ అక్రమంగా నిల్వ ఉంచిన 55 బీర్ బాటిల్లు, 43 క్వాటర్ ల మద్యం సీసాలను సీజ్ చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న పలు లాడ్జీలను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ క్రమంలో రైల్వే స్టేషన్ పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న 15 సంవత్సరాల మైనర్ బాలుడిని పోలీసులు గుర్తించి విచారించగా అతని పేరు శ్రీకాంత్ రుక్మాపూర్ పెద్దేముల్ మండలం నివాసిని అని అతడు ఇంట్లో నుండి పారిపోయి వచ్చినట్లు తేలింది. డీఎస్పీ అంజయ్య తక్షణమే స్పందించి బాలుడి తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారం అందించి, వారిని పిలిపించి బాలుడిని సురక్షితంగా అప్పగించారు. దీంతో బాలుడి తల్లిదండ్రులు పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పాపిలోన్ డివిజన్ బృందంతో కలిసి జరిపిన తనిఖీల్లో హైదరాబాద్ వెళ్ళేందుకు రైల్వే స్టేషన్ వద్ద వేచి ఉన్న నార్సింగి పోలీస్ స్టేషన్ లో వాహనం దొంగతనం చేసిన కేసులోని పాత నేరస్థుడిని పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వ్యక్తులందరిపై సమగ్ర విచారణ జరుపుతున్నామని, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ అంజయ్య స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో వికారాబాద్ ఎస్ హెచ్ ఓ రఘు కుమార్, క్యూఆర్టీ బృందం, వికారాబాద్ క్రైమ్ టీమ్, బ్లూకోల్ట్స్ సిబ్బంది, పోలీస్ స్టేషన్ ఇతర సిబ్బంది సంయుక్తంగా పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

**వివిధ శాఖల అధికారులకు ఆదేశించిన కలెక్టర్ దీపక్ తివారి**



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేయాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి జిల్లా అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటా చారితో కలిసి తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 2న జరిగే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు పూర్తి ఏర్పాట్లు చేయాలనీ, జిల్లా అధికారులు అందరు సమన్వయంతో పని చేయాలనీ సూచించారు. తెలంగాణ అవతరణ దినోత్సవం రోజున కలెక్టర్ కార్యాలయ గ్రౌండ్ లో జాతీయ పతాకావిష్కరణలో భాగంగా పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాలని, ప్రముఖులకు పుర ప్రముఖులకు, అతిథులకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ ఆహ్వాన పత్రాలను అందజేయాలని, ప్రోటోకాల్ (నిర్వహణ నియమాల)ను అనుసరిస్తూ ప్రముఖులు, మీడియా, తదితర సీటింగ్ గ్యాలరీలను జాగ్రత్తగా ఏర్పాటు చేయాలని, జిల్లా ప్రగతిపై రూపొందించే సందేశం కాపీలను సీపీఓ తయారు చేయాలని పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను విద్యాశాఖ అధికారులు చేపట్టాలన్నారు. అలాగే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని, విద్యుత్తు సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా నిరంతరం సరఫరా జరిగే విధంగా విద్యుత్ శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, వివిధ శాఖల అభివృద్ధి తెలిపే స్టాల్స్ ను ఏర్పాటు చేయాలనీ, అధికారులు ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వకుండా సంబంధిత శాఖల అధికారులు తగు ఏర్పాట్లను ముందస్తు జాగ్రత్తలతో నిర్వహించాలని స్పష్టం చేశారు. తాగునీరు, స్నాక్స్ వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని, బందోబస్తు, అమరవీరుల స్థూపం, స్టేజ్ అలంకరణ లను పటిష్టంగా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బి శ్రీధర్, జిల్లా రెవెన్యూ అధికారి వాసు చంద్ర, కలెక్టరేట్ ఏవో ఫర్హీన బేగం , వివిధ శాఖల జిల్లా అధికారులు, డి ఎస్ పి వీరేశ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రజలలో అవగాహన కల్పించాలి

**వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ సూచించారు.99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా వారోత్సవాల సందర్భంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో బాలల మాక్ పార్లమెంట్ – స్నేహ కౌమార బాలికలతో బాలల హక్కుల సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ.. విద్య ద్వారానే ఉన్నత శిఖరాలను అధిగమించవచ్చని దానికి విద్యార్థులు తమ నైపుణ్యాన్ని మెరుగు పరుచుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. విద్యార్థి దశ నుండే సమాజంపై అవగాహన కలిగి ఉండాలని ఆయన తెలిపారు. అసెంబ్లీ, పార్లమెంటరీ సమావేశాల్లో చర్చించే విషయాలపై కూడా అవగాహన కల్పించుకోవాలని ఆయన తెలిపారు. నూతనంగా వచ్చిన ఏఐ విధానంపై అవగాహన కల్పించుకుని సాంకేతికతను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశాభివృద్ధి సాధ్యం అని మహాత్మా గాంధీ సూచించిన విషయాన్ని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. విద్యార్థులు భవిష్యత్తులో తమ లక్ష్యాన్ని ఎంచుకోవడంలో ఉన్నత అధికారుల సలహాలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. గ్రామ పంచాయతీ స్థాయిలో స్నేహ సంఘాల్లో సభ్యులుగా చేరాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటికి జిల్లాలో 4500 స్నేహ సభ్యులుగా నమోదు చేసుకున్నారని, స్నేహ సంఘాలను బలోపేతం చేయడానికి కృషి చేయాలని, జిల్లా యంత్రాంగం తరపునుంచి తమ సహకారం కచ్చితంగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు. మాక్ పార్లమెంటరీలో విద్య, ఆరోగ్యం, హోంశాఖలపై చర్చించడం జరిగింది. మా పార్లమెంటరీలో స్పీకర్, డిప్యూటీ స్పీకర్, మంత్రులుగా స్నేహ సంఘాల సభ్యులు మంచి పాత్రను పోషించారని జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా నూతన అక్షరాస్యులుగా చదువు నేర్చుకున్న అభ్యాసకులకు, చదువు నేర్పిన వాలంటీర్లకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ శ్రీనివాస్, అదనపు డీఆర్డీఏ నర్సింలు, పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉమేష్ కుమార్, వయోజన విద్య జిల్లా ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్ బాబు, డీపీఎం నర్సింలు, కొమరయ్య, శేఖర్, నర్సింలు, జిల్లా మహిళా సమైఖ్య అధ్యక్షురాలు జానకీ, కార్యదర్శి శ్వేత, కోశాధికారి భాగ్యలక్ష్మి , స్నేహ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# మండే ఎండలకు అల్లాడుతున్న మూగజీవాలు..



- పట్టించుకోని అధికార యంత్రాంగం
- భూగర్భ జలాలు అడుగంటి నీళ్ల కోసం అగచాట్లు.. గతంలో నిర్మించిన నీటి తొట్లు ఏమయ్యాయో?

**ఖమ్మం రాజముద్ర న్యూస్:** పాలేరు: రాష్ట్ర వ్యాప్తంగా భానుడు నిప్పులు కురిపిస్తున్న నేపథ్యంలో మూగజీవాలు నీటి కోసం అల్లాడిపోతున్నాయి. భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోవడం, వాగులు–వంకలు, ఏర్లు, రిజర్వాయర్లు ఎండిపోవడంతో పశువులు, పక్షులు, వన్యప్రాణులు దాహార్తితో విలవిల్లాడుతున్నాయి. నీళ్ల కోసం పడరాని పాట్లు పడుతూ అక్కడక్కడే మృత్యువాత పడుతున్న దృశ్యాలు కలచివేస్తున్నాయి.నీటి దాహానికి తాళలేక ప్రమాదకరమైన వన్యప్రాణులు సైతం గ్రామాల్లోకి వస్తున్నాయి. దీనివల్ల పలు జిల్లాలలో మనుషులకు ప్రాణహాని జరుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తీవ్ర నీటి ఎద్దడి ఇలాగే కొనసాగితే అరుదుగా కనిపించే పిచ్చుకలు, గద్దలు, కాకులు, కొంగలు లాంటివి భవిష్యత్ తరాలకు పుస్తకాల్లోనే మిగిలిపోతాయని, ప్రత్యక్షంగా చూడలేమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలను చూసి భయపడే జంతువులు సైతం దాహంతో గ్రామాలపై పంజా విసురుతూ నీటిని తాగుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం మేలుకొని పొలాల్లో, అడవుల్లో, గ్రామాల్లో నీటి తొట్లను యుద్ధప్రాతిపదికన నిర్మించి, నీటి సౌకర్యం కల్పించి మూగజీవాలను కాపాడాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రతి ఒక్కరూ కంటి పరీక్ష ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**




**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో శంకర్ కంటి ఆసుపత్రి నానక్ రామ్ గూడా హైదరాబాద్ వారు నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వికారాబాద్ జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా శిబిరంలో అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి, వైద్య సిబ్బందితో మాట్లాడి శిబిరం నిర్వహణ, రోగులకు అందుతున్న సౌకర్యాల గురించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్వయంగా కంటి పరీక్ష చేయించుకుని, ప్రతి ఒక్కరూ కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, విద్యార్థులు, మధుమేహం వంటి ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు నిర్దిష్ట వ్యవధిలో కంటి పరీక్షలు చేయించుకోవడం అవసరమని తెలిపారు. ఉచిత కంటి వైద్య శిబిరాల ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తున్నాయని, ఇటువంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. శిబిరంలో వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయడంతో పాటు తదుపరి చికిత్సలపై సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారి పవిత్ర, ఏ ఓ ఫర్హీన బేగం వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పౌర హక్కులను సద్వినియోగం చేసుకోవాలి

**రామారెడ్డి ఎస్సై : రాజశేఖర్**



**రామారెడ్డి రాజముద్ర న్యూస్:** పౌర హక్కుల దినోత్సవాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలని రామారెడ్డి ఎస్సై రాజశేఖర్, గ్రామ సర్పంచ్ బండి ప్రవీణ్ పేర్కొన్నారు. రామారెడ్డి గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం పౌరహక్కుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై, సర్పంచ్ మాట్లాడుతూ సమాజంలో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ,బీసీ, ప్రతి పౌరుడు హక్కులను తెలుసుకోవాలని తెలిపారు, ఎస్ఐ మాట్లాడుతూ బైకు నడిపేవారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ చేయరాదని అలా చేయడం వలన ఎన్నో యాక్సిడెంట్ జరిగి తమ కుటుంబాల బజార్ పాలు అవుతున్నాయని తెలిపారు ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ నాయకులు, పెద్దలు, యువకులు కలిసికట్టుగా ఉండి అవినీతి అక్రమాలను అరికట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో, రెవిన్యూ ఎన్ స్పెక్టర్ బద్దం రవికాంత్, ఉప సర్పంచ్ నవీన్, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, రాజకీయ నాయకులు, ప్రజలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో ఈతకు వెళ్లి వ్యక్తి మృతి

**వివరాలు తెలిపిన వికారాబాద్ సిఐ రఘు కుమార్**

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** మద్యం మత్తులో ఈతకు వెళ్లి వ్యక్తి చనిపోయిన సంఘటన వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దన్నారం గ్రామంలో చోటుచేసుకుంది. వికారాబాద్ సిఐ రఘు కుమార్ తెలిపిన వివరాల ప్రకారం వికారాబాద్ పట్టణంలోని యాదయ్య (40) దన్నారం గ్రామం ఒక వ్యక్తి భాయిలో ఈత కు వెళ్లి తగిన మత్తులో భాయిలో పడి చనిపోయినట్టు అయన దృష్టికి వచ్చిందని తెలిపారు. సుమారు 11 గంటలకు ఇంటి నుండి బయలుదేరి మద్యం సేవించి వస్తుండగా తన స్నేహితులతో కలిసి ఈత కోసం ప్రమాద వశత్తు చనిపోయినట్టు తెలిసిందని తెలిపారు. ఎవరూ కూడా మద్యం మత్తులో ఈతకు వెళ్లడం, తాగి వాహనాలు నడపడం గాని సురక్షితం కాదని ప్రజలకు తెలిపారు.

# విస్తృత స్థాయి సమావేశానికి హాజరైన బిఆర్ఎస్ నాయకులు



**రామారెడ్డి రాజముద్ర న్యూస్ :** రామారెడ్డి మండలం ఉప్పల్వాయి గ్రామం నుండి అలాగే అన్ని గ్రామాల బి ఆర్ఎస్ నాయకులు ఎల్లారెడ్డి ఫంక్షన్ హాల్ లో జరిగిన కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి పెద్ద మొత్తంలో హాజరై సభను జయప్రదం చేశారు ఈ కార్యక్రమంలో నారాయణరెడ్డి, కాసర్లరాజేందర్, మైపాల్, రాజేందర్, లక్ష్మణ్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సిఐటియు 56వ వసంతోత్సవ వేడుకలు

**నిరంతరం కార్మికుల సంక్షేమం కోసం పోరుబాటలో సిఐటియు...**



**జవహర్ నగర్, రాజముద్ర న్యూస్:** గత ఐదు దశాబ్దాలకు పైగా రాజిలేని పోరాటాలతో కార్మికుల పక్షాన నిలిచిన ఏకైక శక్తి సిఐటియు అని అన్నారు. శనివారం సిఐటియు ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాలాజీ నగర్ అడ్డాలో జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాలాజీ నగర్ అడ్డాలో కాప్రా సర్కిల్ భవన నిర్మాణ కార్మికుల అధ్యక్షులు దావత్ నాగేష్ జెండా ఆవిష్కరించారు. అనంతరం సిఐటియు ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా భవన నిర్మాణ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షులు చింతకింది అశోక్ మాట్లాడుతూ.. మన హక్కుల రక్షణకై నిరంతరం పోరాటానికి పునరంకితమవుదామని కార్మిక సోదరులకు వందనాలు తెలియజేస్తూ గత 1970 మే 30న ఏర్పాటైన సిఐటియు నేడు 56 వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా దేశవ్యాప్తంగా కోట్ల మంది శ్రామికులకు అండగా నిలుస్తూ వారి జీవన ప్రమాణాల మెరుపుదల కోసం నిరంతరం పోరాడుతున్న ఏకైక సిఐటియు అని కొనియాడారు. ఈ సందర్భంలో కార్మికులందరి శ్రేయస్సునుకాంక్షిస్తూ ఆవిర్భవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు బలరాం కుమార్, రాజు బాబు తదితరులు పాల్గొన్నారు.

## యువత సమస్యలపై నిరంతరం న్యాయ పోరాటం

- విక్రమ్ సింగ్ ఠాకూర్, బీజేవైఎం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (పాలసీ రీసెర్చ్ కో-కన్వీనర్) గా నియామకం..
- నిరుద్యోగం, విద్య, డ్రగ్స్ వంటి సమస్యలపై ఉద్యమానికి హామీ..



**దమ్మాయిగూడ, రాజముద్ర న్యూస్:** మేడ్చల్ రూరల్ జిల్లా కీసర సర్కిల్ దమ్మాయిగూడ డివిజన్ బండ్లగూడకు చెందిన న్యాయవాది, బీజేవైఎం జిల్లా నాయకుడు అడ్వకేట్ విక్రమ్ సింగ్ ఠాకూర్‌కు భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) తెలంగాణ రాష్ట్ర పదవిలో చోటు దక్కింది. రాష్ట్ర పాలసీ రీసెర్చ్ కో–కన్వీనర్‌గా ఆయనను నియమిస్తూ పార్టీ నాయకత్వం నిర్ణయం తీసుకుంది.

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు సూచన మేరకు బీజేవైఎం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుందే ఆధ్వర్యంలో రాష్ట్ర యువమోర్చా నూతన పదాధికారులను నియమించారు. ఈ జాబితాలో మేడ్చల్ రూరల్ జిల్లా కీసర సర్కిల్ దమ్మాయిగూడ డివిజన్ బండ్లగూడకు చెందిన బీజేవైఎం జిల్లా నాయకుడు, న్యాయవాది అడ్వకేట్ విక్రమ్ సింగ్ ఠాకూర్‌కు రాష్ట్ర ప్రధాన అధికారిగా (పాలసీ రీసెర్చ్ కో–కన్వీనర్) బాధ్యతలు అప్పగించారు. అనంతరం విక్రమ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర స్థాయి బాధ్యతలు అప్పగించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుందేకు కృతజ్ఞతలు తెలిపారు. యువత ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. తెలంగాణలో యువత నిరుద్యోగం, విద్య, మానసిక ఆరోగ్యం, డ్రగ్స్ వంటి కీలక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు యువతకు ఇచ్చిన నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్, స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్, కాంట్రాక్ట్ ఉద్యోగాల క్రమబద్ధీకరణ వంటి హామీలు అమలులో విఫలమయ్యాయని విమర్శించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ తదితర వర్గాలకు చెందిన విద్యార్థులు ఎదుర్కొంటున్న అన్యాయాలపై రానున్న రోజుల్లో బీజేవైఎం తరపున న్యాయపరమైన పోరాటాలు చేపడతామని విక్రమ్ సింగ్ ఠాకూర్ పేర్కొన్నారు.

## విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలంటూ డిఈ కి వినతిపత్రం

**మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి**



**నాగారం, రాజముద్ర న్యూస్:** నాగారం డివిజనల్ ఇంజనీర్ (టీజీఎస్ పిడిసిఎల్)ని కలవడం జరిగింది. శనివారం నాగారం గ్రామ పరిధిలో గత 1972 లో వేసినటువంటి విద్యుత్ స్తంభాలు, తీగలు శిథిలావస్థకు చేరి గాలివానకు తెగి ప్రాణ నష్టం జరుగుతుందని వివరించడం జరిగింది. గతంలో హనుమాన్ టెంపుల్ సమీపంలో గాలివానకు జరిగినటువంటి సంఘటన గురించి, నేడు ప్రశాంత్ నగర్ లో జరిగిన సంఘటన తెలుపుతూ శిథిలావస్థకు చేరి విద్యుత్ స్తంభాలను, తీగలను, శిథిలావస్థకు చేరినటువంటి స్తంభాల స్థానాల్లో కొత్తవి ఏర్పాటు చేయాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం డిఈ సానుకూలంగా స్పందించి మంగళవారం రోజున కాలనీలో సందర్శిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి,నక్క కిషోర్ గౌడ్,మెరుగు శ్రీనివాస్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కుల కోసమే సిఐటియు నిరంతర పోరాటం

**కీసరలో ఘనంగా సిఐటియు 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు...**



**కీసర, రాజముద్ర న్యూస్:** సిఐటియు 56వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధి కీసర మండల పరిధిలోని జన్నారం కాలనీలో ఘనంగా సిఐటియు జెండావిష్కరణ చేయడం జరిగిందని సిఐటియు కీసర మండల కన్వీనర్ బంగారు నర్సింగరావు తెలియజేశారు. శనివారం సిఐటియు ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జన్నారం కాలనీ సిఐటియు యూనియన్ ఆఫీస్ వద్ద బండి కలమ్మ జండా ఆవిష్కరణ చేసారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల కోసం, కార్మిక సమస్యల పరిష్కారం కోసం సిఐటియు నిరంతరం పాటుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తార, మంజుల భాయ్, పూజిత భాయ్, మాధురి భాయ్, యాదమ్మ, పోచమ్మ, సాయమ్మ, సుశీల, లక్ష్మి , గౌరీ, తులసి, భారతి, మదరబి సత్తయ్య, శశి, రాజు, మంగుతా నాయక్, జన్నారం కాలనీ మహిళలు, సిఐటియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జనరల్ న్యూస్

## క్షణం క్షణం భయం భయం.. పాలేరులో క్వారీల బాంబుల మోత

- నిబంధనలకు విరుద్ధంగా పేలుళ్లు..
- నేర్రలు బారుతున్న ఇళ్లు,
- భయం గుప్పిట్లో ప్రజలు.. పట్టించుకోని అధికారులు



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** పాలేరు ప్రాంతం క్వారీల పేలుళ్లతో దద్దరిల్లుతోంది. నేలకొండపల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ మండలాల్లో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న బ్లాస్టింగ్‌లతో ప్రజలు క్షణం క్షణం భయం గుప్పిట్లో బతుకుతున్నారు. చెవులు చిల్లులు పడేలా వచ్చే పేలుడు శబ్దాలకు వృద్ధులు గుండెదడతో, పసిపిల్లలు భయంతో ఉలిక్కిపడుతున్నారు.

**129 నల్లరాయి క్వారీలు, 12 కంకర క్వారీలు:**
గనుల శాఖ ఏడీ ఇచ్చిన సమాచారం ప్రకారం నేలకొండపల్లిలో 49, కూసుమంచిలో 12, తిరుమలాయపాలెంలో 37, ఖమ్మం రూరల్‌లో 31 చొప్పున మొత్తం 129 నల్లరాయి క్వారీలు, 12 కంకర క్వారీలకు ప్రభుత్వ అనుమతులు ఉన్నాయి. అయితే ఈ క్వారీల్లో మోతాదుకు మించి పేలుడు పదార్థాలు వాడుతూ యజమానులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**10 కిలోమీటర్ల వరకు వినిపించే మోత:**
"సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా పెద్ద పేలుడు శబ్దం వస్తుంది. ఎక్కడి వారక్కడ బిగుసుకుపోతాం. ఇళ్లలో ఉయ్యాలలో నిద్రపోతున్న పసికందులు ఒక్కసారిగా ఏడుపు మొదలుపెడతారు" అని గ్రామస్తులు వాపోతున్నారు. క్వారీల్లో బాంబులు పేల్చినప్పుడు ఆ శబ్దం సుమారు 10 నుంచి 12 కిలోమీటర్ల వరకు వినిపిస్తోందని, మోతాదు మించిన శబ్ద తరంగాలతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నిబంధనలకు పాతర**
రాళ్లను బయటికి తీయాలంటే పేలుడు పదార్థాలు వాడాల్సిందే. దీనికి ప్రత్యేక అనుమతి అవసరం. కానీ చాలా క్వారీల వద్ద సరైన పత్రాలు లేవని స్థానికులు చెబుతున్నారు. జెలటిన్ స్టిక్స్, ఎలక్ట్రిక్ డిటోనేటర్లు, గన్ పౌడర్‌ను వంద రెట్లు అధిక మోతాదులో వాడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. బాంబుల దాటికి ఇళ్లు నేర్రలు బారుతున్నాయని, పైకప్పు పెచ్చులు ఊడి పడుతున్నాయని, రాత్రిళ్లు భయంతో ఆరుబయటే నిద్రిస్తున్నామని ప్రజలు చెబుతున్నారు.

**బోర్లు ఇంకిపోతున్నాయి, పంటలు నాశనం:**
"బాంబుల శబ్దానికి బోర్లు ఇంకిపోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. వేసవి వస్తే నీరు దొరకని పరిస్థితి. దుమ్ము కొట్టుకుని, రాళ్లు పడి పంటలు నాశనం అవుతున్నాయి" అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**1952 చట్టం తుంగలో తొక్కారు**
లీజు అయిపోయిన క్వారీలను పూడ్చాలని 1952 చట్టం చెబుతోంది. 2014 నుంచి ఇప్పటివరకు 14 లీజులు రద్దయి, వాటిలో గ్రానైట్ వేస్ట్ డంప్ చేయడానికి అనుమతించామని అధికారులు చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో ఎక్కడా పూడ్చిన దాఖలాలు లేవని ప్రజలు మండిపడుతున్నారు. వేస్ట్‌ను రోడ్ల వెంట పోయడంతో గుట్టలుగా మారి ప్రమాదాలకు కారణమవుతున్నాయని విమర్శిస్తున్నారు.

**లెక్కలకు రెక్కలు:**
"క్వారీల కోసం లీజుకు తీసుకున్నది కొంతైతే, ఆక్రమించుకుంది కొండంత. అధికారుల దగ్గర ఉన్న లెక్కలకు, యజమానులు తవ్వుకునే రాళ్లకు పొంతన ఉండదు" అని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని, మామూళ్ల మత్తులో జోగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు."భూకంపం వస్తే పాలేరు ప్రాంతం భూస్థాపితం అయ్యే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా అధికారులు 1952 చట్టాన్ని పూర్తిగా అమలు చేసి చర్యలు తీసుకోకపోతే గ్రామాలను వదిలి వెళ్లిపోతాం" అని ఆయా గ్రామాల ప్రజలు హెచ్చరిస్తున్నారు.

## బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలి






**ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**కాప్రా, రాజముద్ర న్యూస్:** డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం లయన్స్ క్లబ్ బిల్డింగ్ రౌండ్ బిల్డింగ్ లో నిర్వహించిన (ఎస్ఐఆర్) అలాగే బీఆర్ఎస్ పార్టీ మెంబర్‌షిప్ సన్నాహక సమావేశానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. పార్టీకి ప్రజల్లో ఉన్న ఆదరణను మరింత పెంచేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమం కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి,కాసం మైపాల్ రెడ్డి , పెద్దాపురం కుమారస్వామి, బేతాళ బాలరాజు, షేర్ మణమ్మ, మురళి పంతులు, శిరీష, సింగారపు మనమ్మ సత్తమ్మ, గొల్ల పద్మ, రమేష్ చారి, ఎస్కే రహీం, మాట్ల గిరి, ఓట్ల మొగిలయ్య, మొగులయ్య, కే కృష్ణ, ఎంపీ దాసు,సాయి రెడ్డి, రత్నాల కనకయ్య, ఎన్ రమేష్ , నాగపురి రాజు, మల్లేష్, గోవర్ధన్ చారి, ఆనంద్ చారి, ఈ భాస్కర్, సింగారపు రాజు, శివదేవచారి, ఓట్ల యాదగిరి, పంతులు నరసింహ, పాషా, మన్సూర్, సాంబశివరెడ్డి, సత్యనారాయణ గౌడ్, సత్యనారాయణ, మల్లికార్జున, బాలయ్య, సరిత, మాలతి బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నర్సంపల్లి లో "అమ్మ మాట- అంగన్‌వాడి బాట"





- అంగన్‌వాడి కేంద్రాలలో ప్రీ-స్కూల్ విద్యను అభ్యసించిన చిన్నారులకు"విద్యారంభ్ సర్టిఫికెట్"
- జిల్లా సంక్షేమ అధికారి శారద

**మేడ్చల్ జిల్లా కలెక్టరేట్, రాజముద్ర న్యూస్:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్థాయిలో ప్రజా ప్రభుత్వం కార్యక్రమం ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల భాగంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం నాగారం సెక్టార్ లోని నర్సంపల్లి లో గల అమ్మ మాట – అంగన్‌వాడి బాట" పేరుతో ప్రత్యేక నమోదు కార్యక్రమం (న్యూ ఎన్రోల్మెంట్ డ్రైవ్) నిర్వహించబడింది. ఈ కార్యక్రమం ద్వారా అంగన్‌వాడి కేంద్రాలలో ప్రీ–స్కూల్ విద్యను పూర్తి చేసి ప్రథమ తరగతిలో ప్రవేశిస్తున్న చిన్నారులను అభినందిస్తూ వారికి "విద్యారంభ్ సర్టిఫికెట్" అందజేయడం జరిగింది. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శారద మాట్లాడుతూ.. తల్లిదండ్రులకు చిన్నారుల విద్యాభ్యాసంలో అంగన్‌వాడి కేంద్రాల పాత్ర, ప్రాథమిక విద్య ప్రాముఖ్యత,బాలల సమగ్ర అభివృద్ధికి అవసరమైన అంశాలపై అవగాహన కల్పించాము. ప్రథమ తరగతిలో చేరుతున్న 4 నుండి 6 సంవత్సరాల చిన్నారులకు విద్యారంభ్ సర్టిఫికెట్లు అందజేయడం జరిగిందని అన్నారు. అంగన్‌వాడి కేంద్రాల ద్వారా బాలల నమోదు పెంపు, నాణ్యమైన ప్రీ–స్కూల్ విద్య అందించడం,ప్రతి చిన్నారులు విద్యను పొందేలా ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యతెలిపారు. ఈ కార్యక్రమాలలో భాగంగా గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులకు ఆరోగ్యకరమైన ఆహారం, పరిశుభ్రత, మానసిక మరియు శారీరక అభివృద్ధి అంశాలపై శిక్షణ ఇవ్వబడుతుంది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లల ఎదుగుదల, ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షించడంతో పాటు, తల్లిదండ్రులకు అవసరమైన సూచనలు అందించబడతాయి. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్స్, అంగన్వాడి టీచర్స్ 3 నుండి 6 సంవత్సరాల పిల్లల తల్లులు తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని అన్ని అంగన్వాడి సెంటర్ లో సెక్టార్ వైస్, ప్రాజెక్టు వైస్ కూడా ఈ అవగాహన సదస్సు నిర్వహించడం జరిగిందని వారు తెలియజేశారు.



## భారీగా తగ్గిన బంగారం

**హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా బంగారం కొనుగోళ్లలో మందగమనం కనిపిస్తున్న నేపథ్యంలో పసిడి ధరలు తగ్గుముఖం పట్టాయి. బంగారానికి డిమాండ్ గణనీయంగా తగ్గడంతో పాటు విక్రయాలు కూడా భారీగా పడిపోయినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ ప్రభావంతో శనివారం బంగారం ధరల్లో గణనీయమైన తగ్గుదల నమోదైంది. శుక్రవారం హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,57,640గా ఉండగా, శనివారం అది రూ.600 తగ్గి రూ.1,57,040కు చేరింది. అలాగే 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.550 తగ్గి రూ.1,43,950గా నమోదైంది. 18 క్యారెట్ల బంగారం ధర కూడా రూ.450 తగ్గి రూ.1,17,780 వద్ద కొనసాగుతోంది. ప్రధాన నగరాల్లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, ముంబై, బెంగళూరులో రూ.1,57,040గా ఉంది. ఢిల్లీలో రూ.1,57,190గా ఉండగా, చెన్నై, మధురై, కోయంబత్తూరులో రూ.1,59,600గా నమోదైంది. బంగారం ధరలు తగ్గుతున్నప్పటికీ అంతర్జాతీయ పరిస్థితులు, పెట్టుబడి ధోరణులు, డిమాండ్ ఆధారంగా ధరల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. కొనుగోలు చేసే ముందు తాజా ధరలను ఒకసారి పరిశీలించాలని సూచిస్తున్నారు.

## ముంబైలో మళ్లీ గ్యాస్ ధరల షాక్




**ముంబై:** మహారాష్ట్ర రాజధాని ముంబయిలో సామాన్యులపై ఇంధన భారం మరింత పెరిగింది. ముంబయి, పరిసర ప్రాంతాల్లో కంప్రెస్డ్ నేచరల్ గ్యాస్ ధరను కిలోగ్రాముకు రూ.2 మేర పెంచినట్లు గ్యాస్ పంపిణీ సంస్థ ప్రకటించింది. కేవలం 16 రోజుల వ్యవధిలో ధరలు పెరగడం ఇది రెండోసారి కావడం గమనార్హం. వాహనాల కోసం వినియోగించే గ్యాస్‌తో పాటు గృహ అవసరాలకు పైప్‌ల ద్వారా సరఫరా చేసే సహజ వాయువు ధరలను కూడా పెంచినట్లు సంస్థ వెల్లడించింది. తాజా సవరణతో ముంబయిలో గ్యాస్ ధర కిలోగ్రాముకు రూ.86కు చేరింది. గృహ వినియోగ గ్యాస్ ధర కూడా స్వల్పంగా పెరిగింది. ఈ తాజా పెంపుతో మే నెల మధ్య నుంచి ఇప్పటివరకు గ్యాస్ ధరలు మొత్తం రూ.4 మేర పెరిగినట్లయింది. దీంతో వాహనదారులు, గృహ వినియోగదారులపై అదనపు భారం పడనుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి లభించే దేశీయ గ్యాస్ కేటాయింపులు తగ్గడం, బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు గ్యాస్ కొనుగోలు చేయాల్సి రావడం, అంతర్జాతీయంగా రూపాయి విలువ క్షీణించడం వంటి కారణాల వల్ల వ్యయం పెరిగిందని సంస్థ తెలిపింది. మరోవైపు దేశంలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. పలు నగరాల్లో గ్యాస్ పంపిణీ సంస్థలు ఇప్పటికే ధరలను పెంచగా, మరికొన్ని సంస్థలు కూడా అదే దిశగా అడుగులు వేస్తున్నట్లు సమాచారం. అంతర్జాతీయ మార్కెట్‌లో కొనసాగుతున్న అనిశ్చిత పరిస్థితుల ప్రభావంతో గ్యాస్ ధరల్లో మరిన్ని మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. దీంతో వాహనదారులు, గృహిణుల నెలవారీ ఖర్చులు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## గోల్డ్ బాండ్‌లకు భారీ లాభం

ముంబై : సావరిన్ గోల్డ్ బాండ్ పథకంలో పెట్టుబడి పెట్టిన వారికి భారతీయ రిజర్వు బ్యాంకు శుభవార్త అందించింది. 2021-22 రెండో విడత కింద జారీ చేసిన గోల్డ్ బాండ్లకు ముందస్తు విమోచన ధరను ప్రకటిస్తూ యూనిట్‌కు రూ.15,672గా నిర్ణయించింది. ఐదేళ్ల క్రితం ఈ బాండ్లు జారీ చేసిన సమయంలో ఒక్క గ్రాము ధర రూ.4,792గా ఉండగా, ప్రస్తుతం ప్రకటించిన ధరతో పోలిస్తే పెట్టుబడిదారులకు 227 శాతానికి పైగా రాబడి లభించినట్లైంది. దీంతో అప్పట్లో రూ.1 లక్ష పెట్టుబడి పెట్టిన వారికి ఇప్పుడు సుమారు రూ.3.27 లక్షల విలువ లభించే అవకాశం ఏర్పడింది. రిజర్వు బ్యాంకు నిబంధనల ప్రకారం గోల్డ్ బాండ్ల పూర్తి కాలపరిమితి ఎనిమిది సంవత్సరాలు అయినప్పటికీ, ఐదేళ్లు పూర్తయిన తర్వాత వడ్డీ చెల్లింపు తేదీల్లో ముందస్తు విమోచన సదుపాయం కల్పిస్తారు. ఈ బాండ్లు 2021 జూన్ 1న జారీ కావడంతో ఈ ఏడాది జూన్ 1 నుంచి వాటిని నగదుగా మార్చుకునే అవకాశం కల్పించారు. ముందస్తు విమోచన ధరను నిర్ణయించేందుకు బంగారం మార్కెట్ ధరలను ఆధారంగా తీసుకుంటారు. విమోచన తేదీకి ముందు మూడు పని దినాల్లో నమోదైన స్వచ్ఛమైన బంగారం ముగింపు ధరల సగటు ఆధారంగా ఈ ధరను ఖరారు చేసినట్లు సమాచారం. ఈ నిర్ణయంతో గోల్డ్ బాండ్ పెట్టుబడిదారులకు గణనీయమైన లాభం చేకూరనుంది. బంగారం ధరలు భారీగా పెరగడంతో ఈ పథకం ద్వారా పెట్టుబడి పెట్టిన వారు మంచి రాబడిని పొందుతున్నారని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. సురక్షిత పెట్టుబడితో పాటు బంగారం ధరల పెరుగుదల ప్రయోజనాన్ని అందించే ఈ పథకం మరోసారి పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షిస్తోంది.

# జూన్ నుంచి మారనున్న కీలక ఆర్థిక నిబంధనలు

**న్యూఢిల్లీ :** మే నెల ముగిసి జూన్ నెల ప్రారంభం కానున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా పలు కీలక ఆర్థిక నిబంధనలు అమల్లోకి రానున్నాయి. వంటగ్యాస్ ధరల సవరణ నుంచి క్రెడిట్ కార్డుల ఛార్జీలు, మ్యూచువల్ ఫండ్ల నిబంధనలు, ఆధార్ అప్‌డేట్ గడువు వరకు అనేక మార్పులు సామాన్యులపై ప్రభావం చూపనున్నాయి. ప్రతి నెల మాదిరిగానే జూన్ 1న వంటగ్యాస్ సిలిండర్ ధరలను చమురు సంస్థలు సమీక్షించనున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, ముడి చమురు ధరలను బట్టి గృహ, వాణిజ్య సిలిండర్ల ధరల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. భారతీయ రిజర్వు బ్యాంకు విధానాలకు అనుగుణంగా పలు బ్యాంకులు స్థిర నిక్షేపాలు, రుణాలపై వడ్డీ రేట్లను సవరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. కొత్తగా రుణాలు తీసుకునే వారు, ఇప్పటికే నెలవారీ వాయిదాలు చెల్లిస్తున్న వారిపై ఈ మార్పుల ప్రభావం ఉండొచ్చు. జూన్ నుంచి పలు బ్యాంకులు తమ క్రెడిట్ కార్డు నిబంధనల్లో కూడా మార్పులు తీసుకురానున్నాయి. రివార్డు పాయింట్ల పరిమితి, వినియోగ సేవల బిల్లులపై అదనపు రుసుములు, విమానాశ్రయ విశ్రాంతి కేంద్రాల సదుపాయాల విషయంలో మార్పులు ఉండనున్నట్లు సమాచారం. అందువల్ల వినియోగదారులు తమ బ్యాంకుల తాజా నిబంధనలను పరిశీలించాలని సూచిస్తున్నారు. అత్యంత ముఖ్యంగా ఆధార్ వివరాల ఉచిత సవరణకు సంబంధించిన గడువు జూన్ 14తో ముగియనుంది. పేరు, చిరునామా, పుట్టిన తేదీ వంటి వివరాలను ఆన్‌లైన్ ద్వారా ఉచితంగా సవరించుకునే




అవకాశం అప్పటి వరకు మాత్రమే ఉంటుంది. గడువు ముగిసిన తర్వాత రుసుము చెల్లించాల్సి రావచ్చు. మరోవైపు మ్యూచువల్ ఫండ్ లావాదేవీలను మరింత పారదర్శకంగా, వేగవంతంగా మార్చేందుకు కొత్త నిబంధనలు దశలవారీగా అమల్లోకి రానున్నాయి. ఈ మార్పులు పెట్టుబడిదారులకు మరింత భద్రత, సౌలభ్యం కల్పిస్తాయని నిపుణులు చెబుతున్నారు. జూన్ నెలలో అమల్లోకి రానున్న ఈ మార్పులు సామాన్యుల ఆర్థిక ప్రణాళికలపై ప్రత్యక్ష ప్రభావం చూపనున్న నేపథ్యంలో ప్రజలు ముందుగానే అప్రమత్తంగా ఉండాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

# స్పైస్‌జెట్‌కు రూ.124 కోట్ల పన్ను నోటీసు




**న్యూఢిల్లీ :** ప్రముఖ తక్కువ ఖర్చు విమానయాన సంస్థ స్పైస్‌జెట్ మరోసారి ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంది. జీఎస్టీ రిటర్నులు వరుసగా దాఖలు చేయకపోవడంతో వస్తు సేవల పన్ను శాఖ సంస్థకు రూ.124.65 కోట్ల పన్ను డిమాండ్ నోటీసు జారీ చేసింది. అంతేకాకుండా సంస్థ జీఎస్టీ నమోదు ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసు కూడా జారీ చేసినట్లు సమాచారం. అధికారుల వివరాల ప్రకారం నిర్దేశిత గడువులో రిటర్నులు సమర్పించకపోవడంతో సంబంధిత నిబంధనల ప్రకారం తాత్కాలిక అంచనా ప్రక్రియ చేపట్టి బకాయిలను ఖరారు చేశారు. వివిధ నెలలకు సంబంధించిన పన్ను బకాయిలను కలిపి మొత్తం రూ.124.65 కోట్ల డిమాండ్‌ను నిర్ణయించినట్లు తెలుస్తోంది. జీఎస్టీ నమోదు రద్దుకు సంబంధించి ఇప్పటికే నోటీసు జారీ చేసినప్పటికీ సంస్థ నుంచి ఇంకా పూర్తి స్థాయి సమాధానం అందలేదని అధికారులు పేర్కొన్నట్లు సమాచారం. పెండింగ్‌లో ఉన్న రిటర్నులను వెంటనే దాఖలు చేసి నిబంధనలను పాటించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే స్పైస్‌జెట్ ఆర్థికంగా క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోంది. గత త్రైమాసికంలో కూడా సంస్థ భారీ నష్టాలను నమోదు చేసినట్లు వెల్లడించింది. ఈ పరిణామాల ప్రభావం సంస్థ షేర్లపై కూడా కనిపించినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. పన్ను శాఖ తాజా చర్యలతో స్పైస్‌జెట్ భవిష్యత్ కార్యాచరణపై విమానయాన రంగంలో ఆసక్తికర చర్చ సాగుతోంది. ప్రస్తుతం సంస్థ ఈ సమస్యను ఎలా పరిష్కరిస్తుందనేది కీలకంగా మారింది.

# జూన్‌లో బ్యాంకులకు వరుస సెలవులు

### ముందుగానే ప్లాన్ చేసుకోండి..!

**హైదరాబాద్ :** జూన్ నెలలో బ్యాంకు ఖాతాదారులు తమ ఆర్థిక లావాదేవీలను ముందుగానే ప్రణాళిక చేసుకోవాల్సిన అవసరం ఉంది. భారతీయ రిజర్వు బ్యాంకు విడుదల చేసిన సెలవుల జాబితా ప్రకారం వారాంతపు సెలవులతో పాటు పలు ప్రాంతీయ పండుగల సందర్భంగా బ్యాంకులు మూసివేయబడనున్నాయి. జూన్ 15న వైఎంఏ డే సందర్భంగా మిజోరాంలో, రాజా సంక్రాంతి పండుగ కారణంగా ఒడిశాలో బ్యాంకులు పనిచేయవు. జూన్ 25న మొహర్రం సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో బ్యాంకులకు సెలవు ఉంటుంది. జూన్ 26న మొహర్రం సందర్భంగా తెలంగాణ, ఢిల్లీ, మహారాష్ట్ర, కర్ణాటక సహా పలు రాష్ట్రాల్లో బ్యాంకు సేవలు నిలిచిపోతాయి. జూన్ 29న సంత్ గురు కబీర్ జయంతి కారణంగా హిమాచల్ ప్రదేశ్‌లో బ్యాంకులు మూసి ఉంటాయి. జూన్ 30న రెమ్నా




ని పండుగ సందర్భంగా మిజోరాంలో ప్రాంతీయ సెలవు అమలులో ఉంటుంది. ఇవే కాకుండా దేశవ్యాప్తంగా ప్రతి ఆదివారం అయిన జూన్ 7, 14, 21, 28 తేదీల్లో బ్యాంకులు పనిచేయవు. అలాగే రెండో శనివారం జూన్ 13, నాలుగో శనివారం జూన్ 27న కూడా బ్యాంకు శాఖలు మూసి ఉంటాయి. అయితే బ్యాంకు శాఖలకు సెలవులు ఉన్నప్పటికీ ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, ఏటీఎంలు, యూపీఐ సేవలు యథావిధిగా అందుబాటులో ఉంటాయి. గూగుల్ పే, ఫోన్‌పే, నెట్ బ్యాంకింగ్ వంటి డిజిటల్ సేవలను వినియోగదారులు ఎలాంటి అంతరాయం లేకుండా ఉపయోగించుకోవచ్చు. నగదు డిపాజిట్లు, చెక్కుల క్లియరెన్స్, డిమాండ్ డ్రాఫ్ట్‌లు లేదా ఇతర శాఖాపరమైన పనులు ఉన్నవారు సెలవుల జాబితాను ముందుగానే పరిశీలించి తమ పనులను పూర్తి చేసుకోవాలని బ్యాంకింగ్ నిపుణులు సూచిస్తున్నారు.

# విక్రయాల కోసం భారీ తగ్గింపు

### టెస్లా మోడల్ వై ధరలో రూ.9 లక్షల కోత..!

**హైదరాబాద్ :** ప్రపంచ ప్రఖ్యాత విద్యుత్ వాహన తయారీ సంస్థ టెస్లా భారత మార్కెట్లో తన మోడల్ వై కారుపై భారీ ధర తగ్గింపును ప్రకటించింది. దేశీయ మార్కెట్లో ఆశించిన స్థాయిలో విక్రయాలు జరగకపోవడంతో కంపెనీ ఏకంగా రూ.9 లక్షల మేర ధరను తగ్గిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం భారత విద్యుత్ వాహన రంగంలో చర్చనీయాంశంగా మారింది. భారీ ధరల కారణంగా వినియోగదారులు ఇతర కంపెనీల విద్యుత్ వాహనాల వైపు మొగ్గు చూపుతున్న నేపథ్యంలో టెస్లా తన వ్యూహాన్ని మార్చుకుంది. కొత్త ధరలతో మోడల్ వై వాహనం మరింత మందికి అందుబాటులోకి రానుంది. అలాగే భారత మార్కెట్ అవసరాలకు అనుగుణంగా వాహనాల శ్రేణిలో కూడా మార్పులు చేస్తూ కొత్త వేరియంట్లను ప్రవేశపెట్టేందుకు సంస్థ సిద్ధమవుతోంది. ధరల తగ్గింపు వల్ల విద్యుత్ వాహనాల విభాగంలో పోటీ మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా దేశీయ సంస్థలు, ఇతర అంతర్జాతీయ బ్రాండ్లపై ఈ నిర్ణయం ప్రభావం చూపే అవకాశముంది. పెరుగుతున్న పోటీ కారణంగా వినియోగదారులకు మరిన్ని ప్రయోజనాలు లభించే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. భారతదేశంలో విద్యుత్ వాహనాల వినియోగం క్రమంగా పెరుగుతున్న తరుణంలో టెస్లా ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. తక్కువ ధరలకు అత్యాధునిక సాంకేతికత కలిగిన వాహనాలను అందించడం




ద్వారా మార్కెట్ వాటాను పెంచుకోవడమే కంపెనీ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. కొత్త ధరలు తక్షణమే అమల్లోకి వచ్చినట్లు సమాచారం. ఈ భారీ ధర తగ్గింపు తర్వాత టెస్లా విక్రయాలు ఎంత మేర పెరుగుతాయన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# వారణాసి స్టిల్స్ లీక్.. జక్కన్న మౌనం

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'వారణాసి'పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. సినిమా ప్రకటించిన నాటి నుంచే ఈ ప్రాజెక్ట్‌పై అభిమానులు, సినీ వర్గాల్లో ఆసక్తి పెరుగుతూనే ఉంది. ఇటీవల విడుదలైన టీజర్‌తో ఈ చిత్రం ప్రేక్షకులను ఓ కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లబోతోందనే సంకేతాలు మరింత బలపడ్డాయి. అయితే సినిమా షూటింగ్ ఎంత వేగంగా సాగుతోందో, అంతే వేగంగా లీకుల సమస్య కూడా చిత్రబృందాన్ని వెంటాడుతోంది. ముఖ్యంగా రాజమౌళి సినిమాల విషయంలో భద్రతా చర్యలు అత్యంత కట్టుదిట్టంగా ఉంటాయని పేరుంది. గతంలో ఆయన తెరకెక్కించిన చిత్రాల సమయంలో కూడా లీకులను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కానీ 'వారణాసి' విషయంలో మాత్రం వరుసగా కొన్ని విజువల్స్ బయటకు రావడం చర్చనీయాంశంగా మారింది. కొద్ది నెలల క్రితం మహేష్ బాబు, పృథ్వీరాజ్ సుకుమారన్ పాల్గొన్న కీలక సన్నివేశానికి సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో చిత్రబృందంపై రాజమౌళి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని యూనిట్ సభ్యులను హెచ్చరించినట్లు ప్రచారం జరిగింది.ఆ తర్వాత కొంతకాలం పరిస్థితి సద్దుమణిగినప్పటికీ, తాజాగా మరోసారి లీకుల వ్యవహారం తెరపైకి వచ్చింది. ఇటీవల చిత్రీకరించిన ఉగ్రభట్టి గుహల నేపథ్యంలోని కీలక సన్నివేశాలకు సంబంధించిన కొన్ని విజువల్స్ సోషల్ మీడియాలో దర్శనమివ్వడంతో అభిమానులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఈ దృశ్యాలు సినిమా కథలో కీలక భాగంగా భావిస్తున్న నేపథ్యంలో వాటి లీక్ కావడం యూనిట్‌కు ఆందోళన కలిగిస్తున్నట్లు తెలుస్తోంది. కొంతమంది నెటిజన్లు ఈ లీకులు ఉద్దేశపూర్వకంగా బయటకు వచ్చినవై ఉండొచ్చని అభిప్రాయపడుతుండగా, మరికొందరు లీకైన సన్నివేశాలు తుది చిత్రంలో ఉండకపోవచ్చని కామెంట్లు చేస్తున్నారు. ఇంకొందరు మాత్రం రాజమౌళి తనదైన శైలిలో పరిస్థితిని హ్యాండిల్ చేస్తున్నారని, సరైన సమయంలో స్పందిస్తారని భావిస్తున్నారు.







# అజిత్ కుమార్‌కు మాతృవియోగం

తమిళ సినీ పరిశ్రమలో ప్రముఖ నటుడు అజిత్ కుమార్ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆయన తల్లి మోహిని మణి శనివారం ఉదయం కన్నుమూశారు. గత కొంతకాలంగా వయోసంబంధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె, చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ వర్గాలు వెల్లడించాయి. 84 ఏళ్ల మోహిని మణి మరణవార్త తెలిసిన వెంటనే తమిళ సినీ వర్గాలు, అభిమానులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆమెకు ముగ్గురు కుమారులు ఉన్నారు. వారిలో అజిత్ కుమార్‌తో పాటు అనూప్ కుమార్, అనిల్ కుమార్ కూడా ఉన్నారు. కుటుంబ సభ్యులతో ఎంతో ఆప్యాయంగా ఉండే మోహిని మణి మరణం వారి కుటుంబానికి తీరని లోటుగా మారింది. 2023లో అజిత్ తండ్రి పి.ఎస్. మణి అనారోగ్య కారణాలతో కన్నుమూశారు. తల్లి మరణవార్త అందుకున్న వెంటనే విదేశాల్లో ఉన్న అజిత్ కుమార్ అత్యవసరంగా చెన్నైకి బయలుదేరినట్లు సమాచారం. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.


# దర్శకుడు సంపదీప్ రెడ్డి సమర్పణలో రోమాచంకం

'అర్జున్ రెడ్డి', 'యానిమల్' చిత్రాలతో సంచలన విజయాలను అందుకున్న స్టార్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సరికొత్త అవతారంలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. టాలీవుడ్ యువ నటులు సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్‌కుమార్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'రోమాంచకం'. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను సందీప్ సమర్పించబోతున్నాడు. ఈ సందర్భంగా సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సందీప్ రెడ్డి వంగా సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా సినిమాపై తనకున్న ప్రేమను వ్యక్తపరుస్తూ ఒక ఎమోషనల్ నోట్ కూడా రాసుకొచ్చారు. చలనచిత్ర పరిశ్రమలో పంపిణీదారుగా తనకు ఇది మొదటి ప్రాజెక్ట్ అని వెల్లడించారు. కథ వింటున్నంత సేపూ తాను ఎంతగానో నవ్వుకున్నానని, ఈ వినోదం వెనుక ఒక బలమైన ఎమోషన్ కూడా దాగి ఉందని ఆయన పేర్కొన్నారు. భద్రకాళి పిక్చర్స్ బ్యానర్‌పై ఎంతో వైవిధ్యమైన మ్యూజికల్ రొమాంటిక్ కామెడీ చిత్రంగా ఈ 'రోమాంచకం' సినిమా రాబోతోందని ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు.




# పులి-మేకతో రోజా రీఎంట్రీ


సీనియర్ నటి, ఫైర్ బ్రాండ్ రోజా సెల్వమణి ఒకప్పుడు తెలుగు, తమిళ్ ఇండస్ట్రీలలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న రోజా.. రాజకీయాల్లోకి వచ్చాకా సినిమాలు తగ్గించారు. ఇక తాజాగా రోజా తమిళ్ సినిమాలో రీఎంట్రీ ఇచ్చారు. దాదాపు 12 ఏళ్ళ తరువాత ఆమె నటిస్తోన్న చిత్రం లెనిన్ పాండియన్. ఈ సినిమా తెలుగులో పులి మేక అనే పేరుతో రిలీజ్ కానుంది. డి.డి. బాలచంద్రన్ దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రానికి మ్యూజిక్ మ్యాస్ట్రో ఇళయరాజా సంగీతం అందించారు. ఈ చిత్రంలో గంగై అమరన్, దర్శన్ గణెళిశన్ కీలక పాత్రల్లో నటించారు. ఇప్పటికే పులి మేక చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ సినిమా తెలుగు ట్రైలర్ ని మేకర్స్ రిలీజ్ చేశారు. ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంటుంది. ఈ చిత్రం గ్రామీణ నేపథ్యం, రాజకీయాలు, మరియు పోలీసు వ్యవస్థ చుట్టూ తిరిగే ఒక పవర్‌ఫుల్ సామాజిక డ్రామాగా రూపొందింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా ఒక సామాన్య రైతు స్వేచ్ఛగా జీవించలేకపోతున్నాడనే బలమైన సంభాషణతో ఈ ట్రైలర్ మొదలయ్యింది. ఇంకోపక్క కానిస్టేబుల్ గా హీరో ఎన్ని అవమానాలు పడుతున్నాడో చూపించారు. పోలీస్ స్టేషన్లలో కానిస్టేబుళ్లపై జరిగే అణిచివేత, ఉన్నతాధికారుల అహంకారం, మరియు మట్టి మాఫియా వల్ల గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న అన్యాయాలను కళ్ళకు కట్టినట్లు చూపించారు. చట్టం, న్యాయం, మరియు అధికార దుర్వినియోగానికి వ్యతిరేకంగా జరిగే పోరాటమే ఈ సినిమా కథగా తెలుస్తోంది. ఇక ఈ చిత్రంలో రోజా ఒక వయస్సు మళ్ళిన మహిళగా కనిపించారు. మరి ఈ చిత్రంతో రోజా రీఎంట్రీ ఎలా ఉండబోతుందో చూడాలి.




# 300 కోట్లు దాటిన కరుప్పు

తమిళ స్టార్ హీరో సూర్య మరోసారి తన స్టార్ పవర్‌ను బాక్సాఫీస్ వద్ద నిరూపించారు. కరుప్పు చిత్రం విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకులను ఆకట్టుకుంటూ విజయవంతమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. ఈ చిత్రం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకమైన రూ.300 కోట్ల గ్రాస్ కలెక్షన్ల మైలురాయిని అధిగమించి కొత్త రికార్డు సృష్టించింది. సినిమా విడుదలైనప్పటి నుంచి అన్ని ప్రాంతాల్లోనూ అద్భుతమైన స్పందన లభిస్తోంది. ముఖ్యంగా సూర్య పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్, ఎమోషనల్ పర్ఫార్మెన్స్, యాక్షన్ సీక్వెన్స్‌లు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దీంతో కుటుంబ ప్రేక్షకులు, యువత, మాస్ ఆడియన్స్ నుంచి సమానమైన ఆదరణ లభిస్తోంది. సినిమా విజయంలో సాంకేతిక విభాగం పాత్ర కూడా కీలకమైంది. యువ సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ అందించిన నేపథ్య సంగీతం, పాటలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.రూ.300 కోట్ల మార్క్‌ను దాటిన 'కరుప్పు' ఇప్పుడు మరిన్ని వసూళ్ల రికార్డులపై కన్నేసింది. తమిళ సినీ పరిశ్రమలో కూడా 'కరుప్పు' ఒక ప్రత్యేక విజయగాథగా నిలిచేలా కనిపిస్తోంది.




# కరిష్మాకపూర్ తాజా వెబ్ సీరిస్ బ్రౌన్

బాలీవుడ్ సీనియర్ నటి కరిష్మా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా వెబ్ సిరీస్ 'బ్రౌన్'. ఈ సిరీస్ ట్రైలర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ఈ ట్రైలర్ చూస్తుంటే.. సిరీస్ కోల్‌కతా నేపథ్యంలో సాగే ఒక సైకలాజికల్ క్రైమ్ థ్రిల్లర్ అని తెలుస్తుంది. ఒకప్పుడు నగరంలోనే అత్యుత్తమ పోలీసు అధికారిణిగా పేరు తెచ్చుకుని ఆ తర్వాత జరిగిన కొన్ని సంఘటనల వల్ల మానసిక క్షోభను అనుభవిస్తూ, మద్యానికి బానిసైన రీటా బ్రౌన్ (కరిష్మా కపూర్) అనే ఆఫీసర్ చుట్టూ ఈ కథ తిరుగుతుంది. నగరంలో ఒక ప్రముఖ వ్యాపారవేత్త కుమార్తె దారుణ హత్యకు గురికావడంతో, ఈ కేసును దర్యాప్తు చేయడానికి రీటా బ్రౌన్ మళ్లీ విధుల్లోకి రావలసి వస్తుంది. ఈ క్రమంలో ఆమె తన జూనియర్ ఆఫీసర్ ఇన్‌స్పెక్టర్ అర్జున్ (సూర్య శర్మ)తో కలిసి విచారణను ప్రారంభిస్తుంది. ఈ కేసును ఛేదించే పక్రియలో వారు తమ వ్యక్తిగత జీవితంలోని బాధలను, గతాన్ని ఎలా ఎదుర్కొన్నారనేదే ఈ సిరీస్ కథాంశం. ఈ సిరీస్ గురించి కరిష్మా కపూర్ మాట్లాడుతూ, రీటా బ్రౌన్ పాత్ర నేను ఇప్పటివరకు పోషించిన పాత్రల కంటే పూర్తి భిన్నమైనది. ఈ కథలోని భావోద్వేగాలు నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయని పేర్కొన్నారు. అభినయ్ డియో దర్శకత్వంలో, జీ స్టూడియోస్ నిర్మించిన ఈ 'బ్రౌన్' వెబ్ సిరీస్ జూన్ 5 నుంచి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫారమ్ 'జీ5' లో స్ట్రీమింగ్ కాబోతుంది.

Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com